

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 01-09-2026 | సంపుటి - 31 | సంచిక - 99 | రూ : 4 | పేజీలు: 8


# కేసీఆర్ రాజీనామా చేయాలి

## ఈ డిమాండ్‌తో నేటి నుంచి 6 వరకు కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీలు నిర్వహించాలి

- కేసీఆర్ కుటుంబసభ్యులకు పదవులిస్తే.. నేను కార్యకర్తలకు ఇచ్చా
- అల్వాల్, ఎల్బీనగర్, వరంగల్ టిమ్స్‌లకు అంజయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొ. జయశంకర్‌ల పేర్లు
- అంబర్‌పేట మూసీ బ్రిడ్జి ప్రారంభోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ''ఎవరైనా ఉద్యోగి ఏడాది పాటు పనిచేయకపోతే తొలగిస్తారు. ఈ మూడేళ్లలో కేసీఆర్ రూ.1,84,40,000 జీతం తీసుకున్నారు. వాహనాలు, భద్రత సిబ్బంది కోసం ప్రభుత్వం రూ.22,24,40,000 వెచ్చించింది. అంత ఖర్చు పెట్టినా.. ఆయన ఈ వెయ్యి రోజుల్లో ఒక్క రోజు కూడా ఎన్నుకున్న ప్రజలు, రాష్ట్రం కోసం పని చేయలేదు. మూడేళ్లుగా ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. వెంటనే రాజీనామా చేయాలి'' అనే డిమాండ్‌తో కాంగ్రెస్ కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంబర్‌పేట నియోజకవర్గంలో మూసీ నదిపై రూ.52 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని సీఎం సోమవారం ప్రారంభించారు. అనంతరం అంబర్‌పేట క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. కుటుంబ సభ్యులు, మనవడి కోసమే బయటకొచ్చే కేసీఆర్ ప్రతిపక్ష నేతగా విఫలమయ్యారని విమర్శించారు. ఒకటో తేదీ నుంచి 5 వరకు మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి.. 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సభ నిర్వహించాలన్నారు. 7 నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకైనా కేసీఆర్ హాజరుకావాలని.. పదేళ్ల విధ్వంసమేందో.. వెయ్యి రోజుల సుపరిపాలన ఏమిటో చర్చిద్దామని సవాలు విసిరారు. ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్న తనను కేసీఆర్‌తో పోల్చడమా అంటూ రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనను.. పరిపాలన వైఫల్యంగా పేర్కొంటూ భారాస నేతలు చేపట్టిన నిరసన కార్యక్రమాలపై విమర్శలు చేశారు. ఇంకా ఏమన్నారంటే ''హైడ్రాతో

తరువాయి 2లో



పోలైన ఓట్ల కంటే

# అనర్హులే ఎక్కువ!

- మలక్‌పేట, యాకుత్‌పురాలో సర్ ముసాయిదాలో గుర్తింపు
- నగరంలోని 15 నియోజకవర్గాల్లో పోలైనవి 21,72,111
- తొలగింపు

**జాబితాలో చేరినవి 19,41,444**

హైదరాబాద్: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తొలగింపు జాబితాలో చేర్చిన వారి సంఖ్యను నియోజక వర్గాలవారీగా పరిశీలిస్తే ఆసక్తికరమైన అంశాలు బయటపడుతున్నాయి. మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో

తరువాయి 2లో

అంతులేని యుద్ధం కాదు

## యుద్ధానికి ముగింపు కావాలి: పుతిన్‌తో మోదీ

- ఉక్రెయిన్ యుద్ధంపై పుతిన్‌కు మోదీ స్పష్టమైన సందేశం
- అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి ముగింపు వైపు వెళ్లాలన్న మోదీ
- శాంతియుత పరిష్కారాలకే భారత్ మద్దతు ఇస్తుందని వెల్లడి
- ఎస్‌సీఓ సదస్సు వేదికగా ఇరువురు నేతల భేటీ



- వచ్చే వారం భారత్‌కు రానున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

2లో



యూపీలో భారీ పేలుడు..

## 11 మంది దుర్మరణం

- యూపీలోని కౌశాంబిలో బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం
- 11 మంది మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం NDRF, SDRF బృందాల సహాయక చర్యలు
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్‌గ్రేషియా

2లో



## గ్యాస్ వినియోగదారులకు అలర్ట్

# నేడే ఆఖరు తేదీ!

- ఎల్‌పీజీ ఈ-కేవైసీకి నేటితో ముగియనున్న గడువు
- గతంలో ఈ-కేవైసీ చేసినవారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదు
- చేయని వారికి కనెక్షన్ తాత్కాలికంగా నిలిచే అవకాశం
- సబ్సిడీపై కూడా ప్రభావం పడే అవకాశం
- ఇంటి నుంచే యాప్‌ల ద్వారా ఈ-కేవైసీ చేసే వెసులుబాటు

2లో

## ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం




- విశాఖ జిల్లాలో నారా లోకేశ్ పర్యటన
- హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆలయాన్ని సందర్శించిన మంత్రి
- హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ
- ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనం ప్రారంభం
- జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌కు ప్రారంభోత్సవం

2లో

పౌరసేవల్లో డేటా అనలటిక్స్..

పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం

4లో

## ఎయిరిండియాకు బాంబు బెదిరింపు.. అత్యవసర ల్యాండింగ్

- దమ్మామ్-ఢిల్లీ ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు
- అహ్మదాబాద్ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్
- టాయిలెట్‌లో 'బాంబ్' అని రాసి ఉన్న టిష్యూ పేపర్ లభ్యం
- ప్రయాణికులు, సిబ్బంది సురక్షితం, విచారణ చేపట్టిన అధికారులు



సౌదీ అరేబియాలోని దమ్మామ్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానానికి బాంబు బెదిరింపు రావడంతో కలకలం రేగింది. దీంతో విమానాన్ని గుజరాత్‌లోని అహ్మదాబాద్ సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించి, అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులు, సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. సోమవారం ఉదయం 10:25 గంటలకు దమ్మామ్ నుంచి బయలుదేరిన ఈ విమానంలోని వాష్‌రూమ్‌లో 'బాంబ్' అని రాసి ఉన్న టిష్యూ పేపర్‌ను సిబ్బంది గుర్తించారు. వెంటనే వారు పైలట్‌ను అప్రమత్తం చేయడంతో, ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని సమీపంలోని అహ్మదాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు. సాయంత్రం 4:22 గంటల సమయంలో విమానం సురక్షితంగా

తరువాయి 2లో

## సింధు జలాల ఒప్పందం

మధ్యవర్తిత్వ కోర్టు తీర్పును తోసిపుచ్చిన భారత్

2లో

- ఆ కోర్టుకు తమపై ఎలాంటి అధికారం లేదని స్పష్టం
- కోర్టు ఏర్పాటు చట్టవిరుద్ధమని పేర్కొన్న విదేశాంగ శాఖ
- పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్
- తీర్పుతో తమ ప్రాజెక్టులపై ప్రభావం ఉండదని వెల్లడి



# ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం: మంత్రి నారా లోకేశ్

"ఒక వ్యక్తి చేసిన దానం.. నేడు వేల మందికి నీడనిచ్చే మహావృక్షంగా మారింది. సివిల్ సొసైటీ, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ఈ ప్రాంగణమే ఒక చక్కటి ఉదాహరణ" అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇవాళ విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గంభీరంలో ఆయన పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనాన్ని, ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సంస్థకు సహకరిస్తున్న ముఖ్య దాతలతో బోర్డ్‌రూమ్ సమావేశంలో పాల్గొన్నారు.

**సేవే పరమావధిగా సాగిన జీవితం**

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. దివంగత 'పద్మశ్రీ' డాక్టర్ ఎస్.వి. ఆదినారాయణరావు గారు, వారి కుటుంబం సమాజ సేవ కోసం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆ భూమిలో నేడు కాలేజీ, హరేకృష్ణ మిషన్ ద్వారా మధ్యాహ్న భోజన కార్యక్రమం, వృద్ధుల సంరక్షణ కేంద్రం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కొనియాడారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేస్తున్న ఈ రోజుల్లో, వృద్ధుల కోసం అత్యాధునిక కేర్ సెంటర్ నిర్మించడం గొప్ప విషయమని ప్రశంసించారు.

**విలువలతో కూడిన విద్యే లక్ష్యం**

"విద్యాశాఖ మంత్రిగా విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా, విలువలు, నైతికతతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత నాపై ఉంది. 'అమ్మకి చెప్పలేని పని ఏదీ చేయొద్దు' అనే బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి మాట ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం కావాలి. అందుకే ఆయనకు కేబినెట్ హోదాతో సలహాదారు బాధ్యతలు అప్పగించాం. ఆయన సూచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన పుస్తకాలను అందిస్తాం" అని లోకేశ్ వివరించారు. వృద్ధులు గౌరవంగా జీవించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలో ఎక్కడా లేని విధంగా వారికి రూ.4,000 పెన్షన్ అందిస్తున్నారని గుర్తు చేశారు.

**విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

విశాఖపట్నం అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. "రాష్ట్ర విభజన తర్వాత విశాఖ అభివృద్ధి మనందరి బాధ్యత. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్లుగా విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను దేశంలోనే తొలి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మారుస్తాం. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో విశాఖను దేశంలోనే నంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను చంద్రబాబు అభివృద్ధి చేసిన తరహాలోనే విశాఖ అభివృద్ధిలోనూ కొత్త బెంచ్‌మార్క్ సృష్టిస్తామని అన్నారు.

* **అపోహలు వద్దు.. పర్యావరణ పరిరక్షణే ముఖ్యం**

అభివృద్ధి విషయంలో ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని లోకేశ్ అన్నారు.

## పోలైన ఓట్ల కంటే అనర్హులే ఎక్కువ!

హైదరాబాద్: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తొలగింపు జాబితాలో చేర్చిన వారి సంఖ్యను నియోజక వర్గాలవారీగా పరిశీలిస్తే ఆసక్తికరమైన అంశాలు బయటపడుతున్నాయి. మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్ల సంఖ్య కన్నా అనర్హులైన వారే ఎక్కువగా ఉన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 21,72,111 ఓట్లు పోలవగా, తొలగింపు ముసాయిదాలో 19,41,444 మందిని చేర్చారు.

* మలక్‌పేటలో 2026 జూన్‌లో మొత్తం 3,30,191 మంది ఓటర్లున్నారు. ఇక్కడ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 1,31,354, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 1,35,807 ఓట్లు పోలవగా ఇప్పుడు అక్కడ ఏకంగా 1,47,799 ఓట్లను ఈసీ తొలగింపు జాబితాలో చేర్చింది. దాదాపు 44.76% మంది పేర్లు ఈ కేటగిరీలోకి వచ్చాయి.
* యాకుత్‌పురాలో 3,74,948 మంది ఓటర్లకు 2023లో అసెంబ్లీకి 1,39,990, లోక్‌సభ పోలింగ్‌లో 1,56,341 ఓట్లు పోలైతే 1,54,982 ఓటర్లను ఇప్పుడు తొలగింపు జాబితాలో చేర్చడం గమనార్హం. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ ప్రతి పది మంది ఓటర్లలో నలుగురికి పైగా పేర్లు తొలగింపు జాబితాలో ఉన్నాయి.
* ఒక నియోజకవర్గంలో గత ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే పెద్ద సంఖ్యలో గైర్హాజరు, వేరే ప్రాంతాలకు తరలిపోయిన, మరణించిన లేదా ఇతర కారణాలతో గుర్తించలేని ఓటర్లు ఉంటే..గతంలో నమోదైన ఓటర్ల సంఖ్యతో పోలింగ్ శాతం లెక్కించడంపై ప్రభావం పడే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో తక్కువ పోలింగ్ నమోదవుతున్న నియోజకవర్గాల్లో సర్‌లో ఎక్కువ తొలగింపులు కనిపిస్తున్నాయి. మలక్‌పేట, యాకుత్‌పురాలు 2023లో తక్కువ పోలింగ్ నమోదైన నియోజకవర్గాల జాబితాలో ఉన్నాయి.
* తొలగింపు ముసాయిదా జాబితాతో ఓటర్ల పరిశీలనకు పోలింగ్ బూత్ అధికారులు (బీఎల్ఓ) ఇంటింటికి వెళ్లి గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన వారి పేర్లపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను తీసుకుంటున్నారు. నోటీసులు కూడా ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ముసాయిదా జాబితాలో ఉన్నవారి ఓట్లన్నీ తుది జాబితా నుంచి శాశ్వతంగా తొలగిపోయాయని ఇప్పుడే తేల్చడం సరికాదని నేతలు చెబుతున్నారు. కానీ మలక్‌పేట, యాకుత్‌పురాలో గత రెండు ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే తొలగింపు ముసాయిదాలో పేర్కొన్న పేర్లే ఎక్కువగా ఉండటం తీవ్రంగా పరిశీలించాల్సిన అంశమని కాంగ్రెస్ సీనియర్ నేతలు తెలిపారు.

## అంతులేని యుద్ధం కాదు.. యుద్ధానికి ముగింపు కావాలి: పుతిన్‌తో మోదీ

కిర్గిస్థాన్‌లోని బిష్కెక్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ తన దౌత్యపరమైన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. "అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి స్వస్తి పలికే దిశగా అడుగులు వేయాలి" అని ఈ సందర్భంగా పుతిన్‌కు మోదీ సూచించారు. ఈ యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలని యావత్ మానవాళి కోరుకుంటోందని ప్రధాని పేర్కొన్నారు. ఈ సంక్షోభ పరిష్కారానికి ఉద్దేశించిన ప్రతి శాంతియుత ప్రయత్నానికి భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. "ఏ సమస్యనైనా శాంతియుత మార్గాల్లోనే పరిష్కరించుకోవాలన్నదే భారత్ నిశ్చితాభిప్రాయం. ఇది సకల మానవాళి శ్రేయస్సుకు అత్యవసరం. యుద్ధం కొనసాగే ప్రతి రోజూ మానవ ప్రగతిని వెనక్కి నెడుతుంది. కాబట్టి దీనికి తక్షణమే ముగింపు పలకాలి" అని మోదీ వివరించారు. గాంధీ, బుద్ధుడు నడయాడిన భారత గడ్డ ఎల్లప్పుడూ శాంతి మార్గాన్నే బోధిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. 2022లో జరిగిన ఎస్‌సీఓ సదస్సులో "ఇది యుద్ధాల యుగం కాదు" అని పుతిన్‌తో మోదీ చేసిన చారిత్రాత్మక వ్యాఖ్యలకు కొనసాగింపుగానే తాజా సందేశం సాగింది. అటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ, ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ జరిపిన ప్రతి సంభాషణలోనూ చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం సాధ్యమని భారత్ నొక్కి చెబుతూ వస్తోంది.

## గ్యాస్ వినియోగదారులకు అలర్ట్ : నేడే ఆఖరు తేదీ!

గ్యాస్ కనెక్షన్ ఉన్నవారికి ఈకేవైసీ అంశం కీలకంగా మారింది. ఇండేన్, భారత్ గ్యాస్, హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. నేటితో (2026 ఆగస్టు 31) తుది గడువు ముగియనుంది. గతంలో ఉన్న ఆగస్టు 16 గడువును పొడిగించి ఈ తేదీని ఖరారు చేశారు. అయితే ఈ నిబంధన గతంలో ఈకేవైసీ పూర్తి చేయని నాన్ పీఎంయూవై వినియోగదారులకు వర్తిస్తుంది. ఈకేవైసీ ఇప్పటికే పూర్తి చేసినవారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదు. గడువులోగా పూర్తి చేయని వారికి గ్యాస్ సేవల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్యాస్ కనెక్షన్‌ను తాత్కాలికంగా నిలిపివేయొచ్చని సమాచారం. ఈకేవైసీ పూర్తి చేసిన తర్వాత కనెక్షన్‌ను తిరిగి యాక్టివేట్ చేస్తారు. కనెక్షన్ శాశ్వతంగా రద్దు చేయరు. ఈకేవైసీ పూర్తి చేయకపోతే దేశీయ ధరకు గ్యాస్ సిలిండర్ పొందడంలోనూ ఇబ్బందులు రావచ్చని ఇండియన్ ఆయిల్ గతంలో తెలిపింది. కొన్ని నివేదికల ప్రకారం.. ఈ ప్రక్రియ పూర్తి చేయని వారికి దేశీయ సిలిండర్ బదులు వాణిజ్య ధర చెల్లించాల్సి రావొచ్చు. అర్హత ఉన్న పీఎంయూవై లబ్ధిదారుల సబ్సిడీపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ ప్రక్రియను ఇంటి నుంచే పూర్తి చేయొచ్చు. ఇండేన్ వినియోగదారులు 'ఇండియన్‌ఆయిల్ వన్', భారత్ గ్యాస్ వినియోగదారులు 'హలో బీపీసీఎల్', హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు 'హెచ్‌పీ పే' యాప్‌లను ఉపయోగించవచ్చు. ఆధార్ ముఖ గుర్తింపు కోసం ఆధార్‌ఫేస్ ఆర్‌డీ యాప్ అవసరం. యాప్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన తర్వాత ఈకేవైసీ ఆప్షన్ ఎంచుకుని ముఖ స్కాన్ ద్వారా ప్రక్రియను పూర్తి చేయాలి.

## సింధు జలాల ఒప్పందం: మధ్యవర్తిత్వ కోర్టు తీర్పును తోసిపుచ్చిన భారత్

సింధు నదీ జలాల ఒప్పందంపై హేగ్‌లోని అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టు వెలువరించిన తీర్పును భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. దేశ సార్వభౌమ నిర్ణయాలపై తీర్పు చెప్పే అధికారం ఆ కోర్టుకు లేదని సోమవారం స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ఘాటైన ప్రకటన విడుదల చేసింది. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రపంచ బ్యాంకు ఈ మధ్యవర్తిత్వ కోర్టును చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిందని భారత్ ఆరోపించింది. ఈ కోర్టును తాము ఎన్నడూ గుర్తించలేదని, దాని విచారణకు కూడా హాజరు కాలేదని తేల్చి చెప్పింది. "ఈ మధ్యవర్తిత్వ కోర్టుకు మా సార్వభౌమ నిర్ణయాల్లో జోక్యం చేసుకునే అధికారం ఏమాత్రం లేదు. ఇప్పుడు గానీ, భవిష్యత్తులో గానీ ఆ కోర్టు తీర్పులు మా చర్యలపై ఎలాంటి ప్రభావం చూపవు" అని విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడికి పాకిస్థాన్ కారణమని ఆరోపిస్తూ, ఆ దేశంపై తీసుకున్న కఠిన చర్యల్లో భాగంగా 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు కొనసాగినంత కాలం ఈ ఒప్పందం నిలిపివేతలోనే ఉంటుందని భారత్ స్పష్టం చేసింది. తాజా తీర్పుతో తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని, దేశీయంగా చేపడుతున్న జల ప్రాజెక్టులపై దీని ప్రభావం ఏమాత్రం ఉండదని పునరుద్ఘాటించింది.

## కేసీఆర్ రాజీనామా చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్న తనను కేసీఆర్‌తో పోల్చడమా అంటూ రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనను.. పరిపాలన వైఫల్యంగా పేర్కొంటూ భారాస నేతలు చేపట్టిన నిరసన కార్యక్రమాలపై విమర్శలు చేశారు. ఇంకా ఏమన్నారంటే ''హైడ్రాతో చెరువులను సంరక్షిస్తున్నాం. ఈ ప్రాంతం భారాస నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి నుంచి బతుకమ్మకుంటను రక్షించాం. గత సర్కారు మాదిరి పేదలకు ఓఆర్ఆర్ అవతల ఇళ్లు నిర్మించకుండా..ఎక్కడికక్కడ నగరంలోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నాం. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని భారాస ఆఫీసులో రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన హరీశ్‌రావు, కేటీఆర్, సంతోష్.. ఒక చుక్క రక్తాన్ని కూడా దానం చేయలేదు. కేసీఆర్ సీఎంగా పదేళ్లపాటు రాష్ట్రంలో కుటుంబ పాలన సాగింది. కుమారుడు, అల్లుడిని కేసీఆర్ మంత్రులను చేస్తే..నేను భట్టి విక్రమార్క, సీతక్క, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి తదితరులను మంత్రులను చేశా. ఆయన తన బిడ్డకు పదవి ఇస్తే.. నేను శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిని చేశా. కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి అయిలమ్మ పేరు పెట్టా. ఆమె మనుమరాలిని మహిళా కమిషన్ సభ్యురాలిని చేశా. పురానాపూల్ బిడ్డ అనిల్‌కుమార్‌ను రాజ్యసభకు పంపించా. అద్దంకి దయాకర్‌ను ఎమ్మెల్సీ చేశా. నీ పార్టీకి కొడుకును వర్కింగ్ ప్రెసిడెంట్ చేస్తే.. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి బీసీ నేతను అధ్యక్షుడిని చేశా. వారంతా నా కుటుంబ సభ్యులు కాదు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు. ఆ పార్టీ వాళ్లు నన్ను గుంపుమేస్త్రీ అని.. కేటీఆర్‌ను ఐటీ కంపెనీ సీఈఓ అని అంటున్నారు. ప్రజలు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తున్నందుకు..నేను మేస్త్రీనే. కానీ.. కేటీఆర్ సీఈవో కాదు.

* **దివాలా తీసిందని చెబితే ఆశ్చర్యపోయా...**

డిసెంబరు 7, 2023న ఎల్బీస్టేడియంలో సీఎంగా ప్రమాణస్వీకారం చేసి.. సచివాలయం వెళ్లా. అధికారులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ఆరాతీస్తే.. ఏడో తేదీ వచ్చినా.. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని ఫైనాన్స్ సెక్రటరీ చెప్పారు. ఆర్థిక పరిస్థితి పూర్తిగా దివాలా తీసిందని చెబితే ఆశ్చర్యపోయా. రాష్ట్రం విడిపోయే నాటికి రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్, రూ.70వేల కోట్ల అప్పులతో ఉన్న తెలంగాణను..తొమ్మిదిన్నరేళ్లలో కేసీఆర్ రూ.8లక్షల 11వేల కోట్ల అప్పుల్లోకి నెట్టారు. సంవత్సరానికి అసలు, వడ్డీ కలిపి రూ.6,500 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి నుంచి.. రూ.80వేల కోట్లు చెల్లించే స్థితికి తీసుకెళ్లారు. విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు, పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వలేక..వాళ్ల సర్వీసు పొడిగించారు. నేను ప్రభుత్వంలోకి వచ్చాక.. వారంతా పదవీ విరమణకు రావడంతో.. ప్రభుత్వంపై రూ.7వేల కోట్ల భారం పడింది.

## యూపీలో భారీ పేలుడు.. 11 మంది దుర్మరణం

ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ బాణాసంచా ఫ్యాక్టరీలో చెలరేగిన మంటలు వరుస పేలుళ్లకు దారితీయడంతో 11 మంది సజీవ దహనం అయ్యారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పిప్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మనౌరి బజార్‌లో జరిగిన ఈ దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. జిల్లా మేజిస్ట్రేట్ అమిత్ పాల్ శర్మ కథనం ప్రకారం, ప్రమాద సమాచారం అందిన వెంటనే అధికార యంత్రాంగం, పోలీసు బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యల కోసం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (NDRF), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (SDRF) బృందాలను రంగంలోకి దించారు. ఇప్పటివరకు 11 మృతదేహాలను వెలికితీసినట్లు ఆయన ధ్రువీకరించారు. గాయపడిన ఐదుగురిని మెరుగైన చికిత్స కోసం ప్రయాగ్‌రాజ్‌లోని స్వరూప్ రాణి నెహ్రూ (SRN) ఆసుపత్రికి తరలించారు. పేలుళ్ల తీవ్రతకు ఫ్యాక్టరీ భవనంతో పాటు సమీపంలోని కొన్ని నిర్మాణాలు కూడా కుప్పకూలాయి. శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకొని ఉండవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ దుర్ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మేజిస్ట్రేట్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిందితులపై కఠినమైన సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, వారి ఆస్తులను జప్తు చేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన పలువురు ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమని అన్నారు. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి వర్గాలకు సూచించారు. ప్రమాద స్థలంలో బంధువులు తమ వారి కోసం శిథిలాల మధ్య వెతుకుతున్న దృశ్యాలు, ఆసుపత్రుల వద్ద ఆత్మీయుల సమాచారం కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు అక్కడి పరిస్థితికి అద్దం పట్టాయి.

## ఎయిరిండియాకు బాంబు బెదిరింపు.. అత్యవసర ల్యాండింగ్

(మొదటిపేజీ తరువాయి)

ల్యాండ్ అయింది. ల్యాండింగ్ అనంతరం విమానాన్ని విమానాశ్రయంలోని ప్రత్యేక ప్రాంతానికి (ఐసోలేషన్ బే) తరలించారు. ప్రయాణికులను, సిబ్బందిని సురక్షితంగా కిందకు చేర్చి ప్రామాణిక భద్రతా ప్రోటోకాల్స్ ప్రకారం తనిఖీలు నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది, బాంబ్ నిర్వీర్యక దళాలు రంగంలోకి దిగి విమానం క్యాబిన్ సహా లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ప్రాథమిక తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గానీ, పేలుడు పదార్థాలు గానీ లభ్యం కాలేదని అధికారులు స్పష్టం చేశారు. అయినప్పటికీ భద్రతా సంస్థలు తనిఖీలను కొనసాగిస్తూ, ఈ బెదిరింపు వెనుక ఉన్న నిందితులను గుర్తించే దిశగా దర్యాప్తు ప్రారంభించాయి.

## ప్రపంచానికే ప్రళయం వచ్చినా.. ఈ దేశం తట్టుకుని నిలబడుతుంది!

(మొదటిపేజీ తరువాయి)

వల్ల సూర్యరశ్మి భూమికి చేరకపోవడం. రెండోది, భయంకరమైన సైబర్ దాడులు, మహమ్మారులు లేదా భూ అయస్కాంత తుపానుల వల్ల విద్యుత్, రవాణా, ఆహార వ్యవస్థలు కుప్పకూలడం. మూడోది, ఖండాలను నాశనం చేసే స్థాయిలో ప్రాణనష్టం కలిగించే జీవసంబంధమైన ముప్పులు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ కీలకమైన వ్యవస్థలను కాపాడుకుంటూ మానవ మనుగడను కొనసాగించగల సామర్థ్యం ఆస్ట్రేలియాకే ఎక్కువగా ఉందని ఈ అధ్యయనం పేర్కొంది.

**ఆస్ట్రేలియాకే ఎందుకంత శక్తి?**

ఆస్ట్రేలియా పలు కారణాల వల్ల ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. ఇది ఒక ద్వీప ఖండం కావడం వల్ల విపత్తు సమయంలో బయటి ప్రపంచంతో సంబంధాలను సులభంగా తెంచుకుని, తనను తాను కాపాడుకోగలదు. ఆహార ఉత్పత్తిలో దాదాపు స్వయం సమృద్ధి, బలమైన పారిశ్రామిక, మైనింగ్ రంగం, ఆర్థిక స్థిరత్వం, సుస్థిరమైన ప్రజాస్వామ్య పాలన వంటివి ఆ దేశానికి ప్రధాన బలాలుగా ఉన్నాయి. "భూమిపై అత్యంత స్థితిస్థాపకత కలిగిన ప్రదేశం ఆస్ట్రేలియా. అది ఒక ద్వీపం కావడం వల్ల తనను తాను వేరుచేసుకోగలదు. విపత్తుల్లో చిక్కుకునే ఇతర దేశాల ప్రభావం దీనిపై పడదు. ఆస్ట్రేలియాతో సరిహద్దులు పంచుకునే దేశాలేవీ లేవు. అక్కడ ఆహార ఉత్పత్తి చాలా ఎక్కువ, దేశీయంగా బలమైన పరిశ్రమలున్నాయి" అని ఈ పరిశోధన బృందానికి నేతృత్వం వహించిన ఫ్లోరియన్ ఉల్రిచ్ జెన్ వివరించారు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా తర్వాత న్యూజిలాండ్, జపాన్, స్విట్జర్లాండ్, అర్జెంటీనా దేశాలు నిలిచాయి. అయితే, స్విట్జర్లాండ్ మినహా మిగతా దేశాలకు సునామీలు, స్థానిక అగ్నిపర్వతాల నుంచి ముప్పు పొంచి ఉందని పరిశోధకులు తెలిపారు. అయితే, ఏ దేశానికీ సంపూర్ణ భద్రత లేదని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. ఇంధనం, మందులు, ఎరువుల వంటి కొన్ని అత్యవసరాల కోసం ఆస్ట్రేలియా కూడా అంతర్జాతీయ వాణిజ్యంపైనే ఆధారపడి ఉంది. ఈ అధ్యయనం కేవలం ఇతర దేశాలతో పోలిస్తే ఆస్ట్రేలియాకు ఉన్న సాపేక్ష భద్రతను మాత్రమే సూచిస్తుందని, నిజమైన ప్రపంచ విపత్తు సంభవిస్తే దాని ప్రభావం తీవ్రంగానే ఉంటుందని పరిశోధకులు తేల్చిచెప్పారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

* జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్



ప్రజాస్ఫూర్తి, భైంసా: ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వారు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత తప్పనిసరి

* ఎస్పీ. శ్రీనివాస రావు



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా శ్రీనివాస రావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలపై ఫిర్యాదులు అందజేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ చేపట్టి చట్టపరమైన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా పరిగణించి, విచారణ పురోగతిని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలు ఎలాంటి భయం, సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# దైవచింతనతోనే సమాజంలో శాంతి లభిస్తుంది

* ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి*



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్: షాద్ నగర్ పట్టణంలో రామ్ నగర్ కాలనీలో బొడ్రాయి పోచమ్మ ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. దైవచింతనతోనే సమాజంలో శాంతి లభిస్తుందని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, బొడ్రాయి పండుగలు ప్రజలలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వాణి పాండురంగా రెడ్డి, బీఆర్ఎస్ సుధీర్, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్ గౌడ్, చింటు ప్రతాప్ రెడ్డి, ఈశ్వర్ రాజు, చిన్న యాదగిరి, అందెమోని చెన్నయ్య, మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ, బీ ఆర్ ఎస్ నాయకులు బాలకృష్ణ, బాల్ రాజ్, లడ్డు (ఇఫ్లు హిం), శ్రీను, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# బాలిక సంరక్షణ అందరి బాధ్యత

* జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: రాఖీ పౌర్ణమి సందర్భంగా బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్లో సోమవారం రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు జిల్లా కలెక్టర్ తోపాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులకు రాఖీలు కట్టి, బాలికల రక్షణ, విద్య, సమానత్వం, సాధికారత ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సందేశాన్నిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..బాలికల హక్కులు, భద్రత, విద్య భవిష్యత్ అభివృద్ధికి తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం, వారి విద్యను ప్రోత్సహించడం, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొని "బాలికలను రక్షిద్దాం - బాలికలను చదివిద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి, బాలికలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'శక్తి' స్కీమ్ జీవో-97ను వెంటనే రద్దు చేయాలి

* విద్యార్థి సేన అధ్యక్షులు టి.కె. శివప్రసాద్ డిమాండ్

ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : 'శక్తి' స్కీమ్లో భాగంగా పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి సంబంధించిన జీవో97ను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సేన అధ్యక్షులు టి.కె. శివప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్నగర్ విద్యార్థి సేన కమిటీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా టి.కె. శివప్రసాద్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా దశాబ్దాలుగా విజయవంతంగా కొనసాగుతున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యథాతథంగా బలోపేతం చేయకుండా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం ఎవరి ప్రయోజనం కోసం అని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ కళాశాలల విలీన నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు. గత రెండు వారాలుగా వేలాది మంది పాలిటెక్నిక్ విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారని, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు సైతం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోవడం సరికాదన్నారు. తెలంగాణలో సుమారు 60 పాలిటెక్నిక్ కళాశాలలు పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉపాధికి ఉపయోగపడే వివిధ సాంకేతిక కోర్సులను అందిస్తున్నాయని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, కళాశాలల మౌలిక వసతులు, ల్యాబ్లు, హాస్టళ్లు, నిధులను మెరుగుపరచాలని




డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించిన విలువైన భూములపై ప్రభుత్వం దృష్టి సారించిందనే అనుమానాలు విద్యార్థుల్లో ఉన్నాయని పేర్కొంటూ, ప్రభుత్వం వెంటనే జీవో 97ను ఉపసంహరించుకుని పాత విధానంలోనే పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో పాటు విద్యార్థి సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రిషబ్ జైన్, హైదరాబాద్ అధ్యక్షులు చింతల పవన్, షాద్నగర్ శాఖ అధ్యక్షులు నర్సింహా ముదిరాజ్, పరమేశ్వర్, బాలు, రాజు, రాంమోహన్ రెడ్డి, చింటూ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యలు పరిష్కరించాలి

* సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు




ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం చేయాలని సిపిఎం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటు తర్వాత అభివృద్ధి పరుగులు పెడుతున్న హామీ ఇచ్చారు తప్ప కొత్తగూడెంలో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని , అంతర్గత రోడ్లు డ్రైనేజీలు సక్రమంగా లేక ప్రజల ఇబ్బందులు పడుతున్నారని, కోతులు కుక్కల బెడద వలన ప్రజలు బయటికి రావాలంటే భయపడుతున్నారని వెంటనే కార్పొరేషన్ అధికారులు స్పందించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్ సుజాతకు వినతి పత్రం అందజేయగా కమిషనర్ స్పందిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ సందకూరి లక్ష్మి, ప్రసాద్ ఎంఎస్ ప్రకాష్ , కొలిపాక వెంకటేశ్వర్లు, ధనియాకుల శివ ఎస్.కె సాహెబి బాలకృష్ణ రాములు రఘు నిహారిక భారతమ్మ పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ చేసిన గోలేటి పీఓ ఉమాకాంత్‌కు బెల్లంపల్లి జీఎం సన్మానం



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: గోలేటి ఉపరితల గని ప్రాజెక్ట్ అధికారి (పీఓ)గా సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన ఎన్. ఉమాకాంత్‌ను సోమవారం జీఎం కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ వివిధ విభాగాల అధిపతులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏరియా అభివృద్ధిలో, గని నిర్వహణలో ఉమాకాంత్ అందించిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి, పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా జ్ఞాపికగా ఒక మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖైరిగుర పీఓ మచ్చగిరి నరేందర్, ఇంచార్జి ఎస్ఓ టూ జీఎం స్వామి రాజు, ఏరియా ఇంజినీర్ వీరన్న, డీజీఎం (ఐఈ) ఉజ్వల్ కుమార్ బెహరా, డీజీఎం (పర్సనల్) డి. కిరణ్ బాబుతో పాటు వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

* జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సోమవారం జరుగు ప్రజావాణి కి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా , మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, . ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 36 దరఖాస్తులు, డి పి ఓ 7, మున్సిపాలిటీ 5 , డిఎంహెచ్వో 3, మిగిలిన 19 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 70 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, సిపిఓ కిషన్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎంహెచ్వో వెంకటరమణ, డిపిఓ యాదగిరి, డిడబ్ల్యూఓ నరసింహారావు జిల్లా అధికారులు, తదితరులు హాజరైనారు.

# అంతర్జాతీయ సదస్సుకి ఏజెన్సీ గిరిజన బిడ్డ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలం, అప్పలరాజు పల్లి దుబ్బతండ గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ తేజ నాయక్ కుమారుడైన మోహన్ దారావత్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడం, మారుమూల ప్రాంతమైన దుబ్బ తండ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ ఉన్నత స్థాయికి చేరుకున్న మోహన్ దారావత్.అడవి ప్రాంతంలో బస్సులు లేకపోయినా ఇలాంటి సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో నేను ఏదో సాధించాలి అని గ్రామం నుంచి పట్టణానికి వచ్చి ఉన్నత చదువులు చదివి ప్రొఫెసర్ గా విద్యార్థులకు పాఠాలు చెబుతూనే అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ, కుల,జాతి నిర్మూలన కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్న మోహన్ ధరావత్ ని ప్రపంచ అంతర్జాతీయ వేదికలలో ప్రసంగించే అవకాశం కల్పించిన స్పెయిన్ యూనివర్సిటీ వారికి రుణపడి ఉంటానని మోహన్ ధరావత్ ఆనందం వ్యక్తం చేశారు.యూనివర్సిటీ ఆఫ్ మాడ్రిడ్ నిర్వహించే ప్రపంచ ఉత్తర, దక్షిణ దేశాల ప్రాంతాలలో జనాభా గతిశీలత నిర్మాణంలో మార్పులు ,వలసలు, మారుతున్న ప్రదేశాలు అనే పేరుతో నిర్వహించనున్న ఈ అంతర్జాతీయ సదస్సు 2026 సెప్టెంబర్ 10 మరియు 11 తేదీలలో, స్పెయిన్‌లోని కార్లోస్ III యూనివర్సిటీ ఆఫ్ మాడ్రిడ్, గెటాఫే క్యాంపస్ స్పెయిన్ లో జరిగే ఈ అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ మోహన్ దారావత్ కులం, వలసలు మరియు అసమానతలు ప్రపంచవ్యాప్తంగా కుల వ్యవస్థ కొనసాగింపు, కుల వ్యతిరేక ఉద్యమాలు అనే అంశం మీద ప్రసంగించబోతున్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తుంది

* ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : గణపురం మండలంలోని ధర్మరావుపేటలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు భూమిపూజ చేశారు. అనంతరం బుద్ధారం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. పెద్దమ్మతల్లి ఆలయంతో పాటు ఇతర దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సంచార తెగల అభ్యున్నతికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

* అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్




ప్రజా స్ఫూర్తి, భైంసా: జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంచార జాతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన సంచార, విముక్త తెగల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.సంచార జాతుల పిల్లలకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు యువతకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వాలు అందించే పథకాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు సమాజానికి చిరస్మరణీయం

* మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి*



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ : పాపిరెడ్డిగూడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోప్పునూరి శ్రీశైలం పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హాజరై పదవీ విరమణ చేస్తున్న హెచ్‌ఎం శ్రీశైలంను సన్మానించారు.ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఒక ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా శ్రీశైలం అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. పదవీ విరమణ అనేది సేవలకు ముగింపు కాదని, జీవితంలో మరో కొత్త అధ్యాయానికి ప్రారంభమని పేర్కొంటూ, శ్రీశైలం గారు భవిష్యత్తులో మరింత సంతోషంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శశిరేఖ యాదయ్య, మహిళా అధ్యక్షురాలు రాణి, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయులు కోప్పునూరి శ్రీశైలంకు శుభాకాంక్షలు తెలిపారు.

# "సౌకర్యాల బాధ్యత నాది.. చదువు బాధ్యత మీది

* విద్యార్థులకు మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా.. మౌలిక వసతుల కల్పనకు మంత్రి పొన్నం ప్రభాకర్ పెద్దపీట! ఇంజనీరింగ్ కళాశాలలో బాల, బాలికల హాస్టళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ "సౌకర్యాలు కల్పించే బాధ్యత నాది.. వాటిని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరే బాధ్యత మీది" అంటూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపారు. గ్రామీణ ప్రాంత



విద్యార్థులకు ఉన్నత విద్య మరింత చేరువ కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

* విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా..

దూర ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులకు వసతి సమస్యలు లేకుండా బాల, బాలికల కోసం ప్రత్యేక హాస్టళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. విద్యతో పాటు సురక్షితమైన వసతి, అవసరమైన మౌలిక సదుపాయాలు అందిస్తే విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదవాలని మంత్రి సూచించారు. ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. హాస్టల్ నిర్మాణం పూర్తయితే విద్యార్థుల వసతి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు కళాశాలలో విద్యాభ్యాసానికి మరింత అనుకూల వాతావరణం ఏర్పడనుంది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్ ప్రిన్సిపల్ తిరుపతిరెడ్డి పురపాలక సంఘం చైర్ పర్సన్ దండి లక్ష్మి వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ కౌన్సిలర్లు మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కెడం లింగమూర్తి సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య తదితరులు పాల్గొన్నారు

## పొలంలో నెమలి.. అధికారులకు అప్పగింత



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి: గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక రైతు మామిడి వీరమల్లు కౌలు చేస్తున్న పొలంలో గాయాలతో ఎగరలేక నడుచుకుంటూ వస్తున్న జాతీయ పక్షి నెమలి కనిపించింది.నెమలిని గుర్తించిన రైతు వీరమల్లు దానికి ఎలాంటి హాని కలగకుండా రక్షించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో బీట్ ఆఫీసర్ సైదులు అక్కడికి చేరుకుని నెమలిని సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు. నెమలిని రక్షించి అధికారులకు అప్పగించిన రైతు వీరమల్లును స్థానికులు అభినందించారు.ఈ సందర్భంగా వన్యప్రాణులు, పక్షులు గ్రామాల్లోకి వస్తే వాటిని ఇబ్బంది పెట్టకుండా అటవీశాఖ కు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుకుమార్,గోపి,శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

* కూసుమంచి ఎంఈవో రాయల వీరస్వామి



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: దివ్యాంగులను సమాజంలోని అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఎం ఈఓ రాయల వీరస్వామి అన్నారు. వారిలో అపారమైన ప్రతిభ, సామర్థ్యం దాగి ఉందని, వారికి సరైన అవకాశాలు, ప్రోత్సాహం అందిస్తే వివిధ రంగాల్లో విశేష విజయాలు సాధించగలరని కూసుమంచి ఎంఈవో రాయల వీరస్వామి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులలో అపారమైన ప్రతిభ, సామర్థ్యం దాగి ఉందని, వారికి సరైన అవకాశాలు, ప్రోత్సాహం అందిస్తే వివిధ రంగాల్లో విశేష విజయాలు సాధించగలరని పేర్కొన్నారు. ఆటలు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని, పోరాట స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రభుత్వం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు సమిష్టిగా దివ్యాంగులకు అవసరమైన సహకారం అందించి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. దివ్యాంగులు కూడా తమ ప్రతిభను నిరూపించుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పి కళ్యాణి, ఫిజియోథెరపిస్ట్ నాగలక్ష్మి, స్పెషల్ ఎడ్యుకేటర్స్ రాజ్యలక్ష్మి, అనిత, కేర్ గివర్ పుష్పలత, సీఆర్పీలు, ఎమ్మార్పీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాంరెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యువజన కాంగ్రెస్ నాయకుడు కంచరకుంట్ల రాంరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాంరెడ్డితో కేక్ కట్ చేయించారు. ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని, ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో ముందుకు సాగుతూ.. భవిష్యత్తులో ఉన్నత పదవులు చేపట్టాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. అదేవిధంగా రాంరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు పుష్పగుచ్ఛాలు అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

* డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా : కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 48 దరఖాస్తులను సోమవారం స్వీకరించారు. అందులో భూ భారతి 16, ఇందిరమ్మ ఇండ్లు 6,పెన్షన్ 1, ఇతర 25 మొత్తం 48 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా డి ఆర్ ఓ అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా పరిష్కరించి పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పట్ల అధికారులు స్పందిస్తూ, వినతులను పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆదాయానికి ప్రజల ఆరోగ్యానికి నష్టం కలిగించిన సునంద రైస్ మిల్లు

* రీ ఓపెనింగ్ కి పర్మిషన్ ఇస్తే ప్రజా ఉద్యమం

గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి. : గరిడేపల్లి గ్రామ ప్రజలు, ఎంఆర్పీఎస్, మరియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రజావాణిలో దరఖాస్తు ఇవ్వడం జరిగిందని ఎమ్మార్పీఎస్ గరిడేపల్లి మండల అధ్యక్షులు కొత్తపల్లి రవి మీడియాకు తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకి అన్ని విధాలుగా నష్టపరిచిన సునంద రైస్ మిల్లుకు ఎట్టి పరిస్థితుల్లో రీ ఓపెనింగ్ కి పర్మిషన్ ఇవ్వకూడదని ప్రభుత్వానికి 22 కోట్లు నష్టం కలిగించడలో, నిజమైన రిమాండ్ కింద అరెస్టయి రావడం మరియు గ్రామ ప్రజలకు కూడా నష్ట కలిగిస్తూ వస్తున్నది అని,ఎలాంటి పర్మిషన్స్ లేకుండా, చట్టానికి, నియమ నిబంధనలకు విరుద్ధంగా ఇన్ని సంవత్సరాలు నడిచినటువంటి సునంద రైస్ మిల్ తక్షణమే, బ్లాక్లిస్టులో పెట్టి రీఓపెనింగ్ చేయకుండా పూర్తిగా మిల్లును అక్కడి



నుంచి తొలగించాలని కోరారు. లేనిపక్షంలో పర్మిషన్ ఇస్తే ప్రజా ఉద్యమం కూడా తప్పదని ,సివిల్ సప్లై వారిని మోసం చేసి ,సీఎంఆర్ బియ్యం, నిధుల దుర్వినియోగం జరగడం ఇదంతా సివిల్ సప్లై మినిస్టర్ ఉన్న మన హుజూర్నగర్ నియోజకవర్గంలో జరగడం బాధాకరమని, తక్షణమే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించి సదరు మిల్లుపై చట్టపర చర్యలు తీసుకొని, అక్కడి నుండి పూర్తిగా తొలగించాలని పత్రికా ప్రకటన ద్వారా కోరడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ గరిడేపల్లి గ్రామ అధ్యక్షులు పిట్ట వెంకటేష్, మాచర్ల కనకయ్య, పిట్ట అశోక్,ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు దూర వినోద్, పిట్ట నాగార్జున, ఆలంపల్లి శేఖర్, పిట్ట నాగరాజు, కుర్రి వెంకన్న, పిట్ట నరసయ్య, అమరారపు మహేష్,అమరారపు రవి తదితరులు పాల్గొన్నారు.

## అభాసుపాలవుతున్న 'ప్రజావాణి..'

* సిబ్బంది లేక దరఖాస్తుదారుల ఇబ్బంది..!!
* సకాలంలో హాజరుకాని అధికారులు హాజరైనవారిలో సగం సెల్ ఫోన్ కే అంకితం
* కూసుమంచి ఎంపీడీవో కార్యాలయంలో నామమాత్రంగా ప్రజావాణి నిర్వహణ

కూసుమంచి,ప్రజాస్ఫూర్తి:కూసుమంచి మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి అధికారుల తీరుతో అభాసుపాలవుతోందనడానికి సోమవారం జరిగిన సంఘటనే సజీవసాక్ష్యంగా నిలుస్తోంది. మండలంలోని సుదూర ప్రాంతాల నుంచి ఫిర్యాదుదారులు తమ వినతులు సమర్పించడానికి కార్యాలయానికి రాగా కనీసం ఫిర్యాదు స్వీకరించే నాథుడే లేక ఇబ్బంది పడ్డారు. ఎంపీడీవో సెలవులో ఉన్న కారణంగా సంబంధిత కార్యాలయం సిబ్బందిని నోడల్ ఆఫీసర్ గా కేటాయించినా...ఎవరూ ఆ బాధ్యత నిర్వర్తించక పోవడంతో ప్రజలు నానా ఇబ్బంది పడ్డారు. తమ గోడు విన్నవించుకునే అవకాశం లేక కంప్యూటర్ ఆపరేటర్ కు తమ వినతులు అందించి, ఆన్ లైన్ చేసుకనే పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఎవరూ లేకపోవడంతో ఇక తమ దరఖాస్తు పరిష్కారం అయినట్లే అని పెదవి



విరుస్తూ సంబంధిత ఫిర్యాదుదారులు వెనుదిరిగారు.

* అధికారులు లేక ఖాళీ కుర్చీలకు వినతి..!!

కూసుమంచి మండలకేంద్రంలో సూర్యాపేట ప్రధానరహదారిపై అనేక ఇబ్బందులు ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని బీజేపీ, ఎంఎల్ పార్టీ నాయకులు ఆర్ అండ్ బీ అధికారులకు వినతి పత్రం సమర్పించేందుకు రావడంతో వినతిపత్రం తీసుకునేందుకు ఏ అధికారి అందుబాటులో లేకపోవడంతో వారు ఖాళీ కుర్చీలకు వినతిపత్రం అందించి వెనుదిరిగారు. ఈ సందర్భంగా కూసుమంచి 8వవార్డు మెంబర్ గుండా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రజావాణి నిర్వహించి, ప్రజల సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నామని చెప్పే మాటలు అన్నీ డొల్ల అని విమర్శించారు. అధికారులు ప్రభుత్వ లక్ష్యం నీరుగారుస్తున్నా చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. తక్షణమే కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

* నాలుగు నెలలైనా పరిష్కారం ఏది..? ఓ రైతు ఆవేదన..

తాను కూసుమంచి మండలానికి చెందిన రైతునని, తాను పండించిన పంటను కోనుగోలు కేంద్రంనుంచి ఏప్రిల్ నెలలో ప్రభుత్వానికి 61బస్తాలు అమ్మినట్లు తెలిపాడు. అయితే తన పంటకు సంబంధించిన నగదు వేరే రైతు ఖాతాలో జమ అయిందని, ఈ విషయంపై జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో కూడా మొరపెట్టుకున్నానని, అక్కడనుంచి కూసుమంచి తహసీల్దార్ కు రిఫర్ చేశారని, అప్పటినుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కనీసం పరిష్కారం కాలేదని, తాను మరలా మండలపరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వస్తే కనీసం ఇక్కడ ఫిర్యాదు స్వీకరించే అధికారులే లేరని వాపోయాడు.

## ఢిల్లీ రాంలీలా సభతో కేంద్రానికి హెచ్చరిక

* ఢిల్లీ రాంలీలా సభతో కేంద్రానికి హెచ్చరిక
* జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా

ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో రేపు జరగనున్న భారీ ప్రజాచైతన్య బహిరంగ సభ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు గట్టి హెచ్చరిక కానుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా స్పష్టం చేశారు. జిల్లా కేంద్రం నుంచి తరలిన ప్రతినిధుల బృందంతో కలిసి సోమవారం ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పేద, మధ్యతరగతి వర్గాలు, రైతాంగం, శ్రామిక వర్గం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై గళమెత్తేందుకే ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, సామాన్య



ప్రజల హక్కులను కాలరాస్తున్న పాలకుల వైఖరిని ఎండగట్టేందుకు ప్రజలు, కార్మికులు, రైతులు, యువత ఏకతాటిపైకి వస్తున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వంటి అంశాలపై రాంలీలా మైదానం వేదికగా సమరశంఖం పూరించనున్నట్లు వివరించారు. ఈ సభ ద్వారా దేశవ్యాప్త ప్రజా పోరాటాలకు స్పష్టమైన కార్యాచరణ, నూతన దిశానిర్దేశం లభించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు సలిగంటిశ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, వి పూర్ణ చందర్ రావు, ఉప్పుశెట్టి రాహుల్, అడుసుమిల్లి సాయిబాబా, కంచర్ల జమలయ్య, మువ్వా వెంకటేశ్వరరావు, డి. సుధాకర్, రాజబాబు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

* సిఐటియు జిల్లా కార్యదర్శి సమ్మెట రాజమౌళి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఎస్సీ హాస్టల్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం పెరుమాళ్ల జగన్నాథం భవన్లో బండి వసంత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్ ఔట్సోర్సింగ్ కార్మికులు వసతి గృహాల్లో వంట పని 25 సంవత్సరాల నుండి తక్కువ జీతాలకు ఏజెన్సీలో పని చేస్తున్నారు. వీరికి ఉద్యోగ భద్రత లేదు,మూడు సంవత్సరాల పెండింగ్ వేతనాలు ఉన్నాయి. జిల్లా అధికారులను అడుగుతే మనసులో ఏదో పెట్టుకొని వేధిస్తున్నారు. ఉద్యోగాన్ని తీసి వేస్తామని బెదిరిస్తున్నారూ. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఏజెన్సీ ద్వారా కాకుండా కార్పొరేషన్ ద్వారా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చింది.ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని వేధింపులు, బెదిరింపులు ఆపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తప్పట్ల వీరన్న,ఇమామ్ సహాయబ్,పాము వెంకటనారాయణ, వెంకటమ్మ సత్తమ్మ,పశువుల శ్రీలత,ఏ ఉష, ఇనుగుర్తి అచ్చమ్మ, ఎం సరిత,కొమ్ము రేణుక,జి లక్ష్మీ, నరసమ్మ,మైస స్వరూప,గుడెల్లి యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడు సీఎం విజయ్ నీ కలిసిన భువనగిరి లోక్ సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : చెన్నైలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్టడీ టూర్ లో పాల్గొన్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం పట్టణాభివృద్ధికి సంబంధించిన కీలకమైన అంశాలపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు *కిరణ్ కుమార్ రెడ్డి చర్చించారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశం ముగిసిన తర్వాత తమిళనాడు సీఎం విజయ్ తో కిరణ్ కుమార్ రెడ్డిమర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. తెలంగాణ,తమిళనాడు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అంశాలపై సీఎం విజయ్ తో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చర్చించారు.

## ప్రభుత్వ పథకాలపై అపోహలు వద్దు

* ప్రతిపక్షాలకు పని పాట లేదు..
* షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : పనీపాటా లేని ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని, ప్రభుత్వ పథకాలు అన్ని కూడా అమలు అవుతాయని ఎట్టి పరిస్థితుల్లో ఆగవని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 150 మంది లబ్ధిదారులకు రూ. 50 లక్షల లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయనిది చెక్కులను ఎట్టి పరిస్థితుల్లో ఆపబోమని అన్నారు. ప్రతిపక్షాలు కావాలని ప్రజలను తప్పుతో పట్టించి అధికార పార్టీని బదనాం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాల నిర్వహణలో లోపాలు గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయని అలాంటి లోపాలకు అతీతంగా పథకాలను చట్టబద్ధంగా అమలు చేస్తామని ఆయన వెల్లడించారు. నిరుపేదలను ఆదుకునేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇలాంటి మంచి మంచి పథకాలను రూపొందించారని, వాటిని అమలులోకి తెచ్చే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ అగ్గునూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందేమోహన్ లతో కలిసి ఆయన చెక్కులు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు మురళీమోహన్ (అప్పి), కొప్పునూరు ప్రవీణ్, జమ్రుద్ ఖాన్, దంగు శ్రీనివాస్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గాంధీనగర్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జల్దా రాఘవులు సంస్మరణ సభ




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : మాజీ పంచాయతీ సభ్యులు, గాంధీనగర్ సంక్షేమ సంఘం వ్యవస్థపాక అధ్యక్షులు జల్దా రాఘవులు సంస్మరణ సభ సోమవారం గాంధీ నగర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు,స్థానిక ప్రజలు పాల్గొని స్వర్గీయ జల్దా రాఘవులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు.ముఖ్యంగా స్వర్గీయ రాఘవులు సమాజ సేవకునిగా, మానవతా వాదిగా అందించిన సేవలకు గుర్తుగా ఆయన విగ్రహాన్ని గాంధీనగర్ లో ప్రతిష్టించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఖాజా మియా, రంగా శ్రీనివాస్ గౌడ్, మేకల ఎల్లయ్య, జల్దా లక్ష్మి నాథ్, మీసాల సత్యనారాయణ, బండారి సాయి కుమార్, వాజీద్, బాలయ్య, రాములు , యువజన సభ్యులు పాల్గొన్నారు..

# ఎమ్మెల్యే పీఏ అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: జేఏసీ



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అమాయక ప్రజల నుంచి ఉద్యోగాలు, బదిలీల పేరుతో డబ్బులు వసూలు చేసిన భద్రాచలం నియోజకవర్గ శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు పీఏ కొర్ల కళ్యాణ్ కుమార్ వెనుక ఉన్న వారిని వెలికి తీయాలని, అసలు నేరస్తులను అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ బానోత్ వీరు నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసన సభ్యుడి వద్ద పీఏగా పనిచేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వందలాది మంది వద్ద నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసగించాడని, ఇది ఏమాత్రం సహించరానిదన్నారు. అమాయక నిరుద్యోగులు అతని మాటలు నమ్మి లక్షల రూపాయలు అప్పుగా తీసుకువచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దగ్గర పనిచేసే పీఏ.. ఎమ్మెల్యేకు తెలియకుండానే కోట్ల రూపాయలు వసూళ్లకు పాల్పడ్డాడంటే నమ్మశక్యంగా లేదని, దీని వెనుక ఎమ్మెల్యే హస్తం కూడా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. జెన్కో, ట్రాన్స్కో, ఐటీసీ వంటి పలు ప్రభుత్వ కంపెనీల్లో పర్మనెంట్ పోస్టుల పేరుతో నకిలీ అపాయింట్మెంట్ లెటర్లను సృష్టించి ఇవ్వడం వెనుక ఎవరెవరున్నారనే విషయాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పీఏతోపాటు ఎమ్మెల్యే, ఆయన బంధువుల బ్యాంకు ఖాతాల లావాదేవీలను పరిశీలించాలని, అవసరమైతే సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరారు. విలేకరుల సమావేశంలో జేఏసీ జిల్లా నాయకులు బానోత్ రమేష్, గుగులోత్ భద్రు, జాటోత్ భరత్, ధరావత్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

# కల్మల్ చెరువు పశువైద్యశాలకు పర్మినెంట్ డాక్టర్ ను నియమించాలి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: గరిడేపల్లి మండలం కల్మల్ చెరువు గ్రామంలో గల పశు వైద్యశాలలో పర్మినెంట్ డాక్టర్ మరియు సిబ్బంది అందుబాటులో లేక పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ గిరిజన శక్తి నియోజకవర్గ అధ్యక్షులు గుగులోతు అంజినాయక్ ఆరోపించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... గత నెల రోజుల నుండి ఇంఛార్జి డాక్టర్ పరిధిలో పశు వైద్యశాల నడుస్తున్న తరుణంలో కల్మల్ చెరువు పరిధిలోని శీత్ల తండ, సోమ్లా తండ, లుంబా తండ ల్లోని గిరిజన పాడి రైతులు సమయానికి రాలేక పోతున్నారని తెలిపారు. కావున పూర్తి స్థాయిలో డాక్టర్లు , సిబ్బంది అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# జెన్ జీ పోరాటం స్ఫూర్తిదాయకం

* మోదీ కార్పొరేట్, మతోన్మాద విధానాలను తిప్పి కొట్టాలి




ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మంద నాగక్రిష్ణ అధ్యక్షతన నిర్వహించిన జెన్ జీ మీట్ 'కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అఖిల భారత సహాయ కార్యదర్శి ఐ సి గోష్ , రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పాల్గొని వారు మాట్లాడుతూ జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థి, యువత ఉద్యమం దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఒక కొత్త దిశను చూపించిందని , విద్యార్థులు తమ విద్యా, ఉద్యోగ హక్కుల కోసం మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం కూడా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణలో అవకతవకలు, నిరుద్యోగం వంటి సమస్యలపై ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సిందేనని అన్నారు. విద్యను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ వైపు నడిపించే విధానాలను వ్యతిరేకిస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్ , గర్ల్స్ కన్వీనర్ మమత , సహాయ కార్యదర్శి తుడం ప్రవీణ్ , జిల్లా ఉపాధ్యక్షులు మాదాసు అఖిల్ , జిల్లా నాయకులు భానుచరణ్, సాయి కిరణ్, సాయి సంతోష్, పృథ్వి , సిరివర్ధన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

* అర్హత కలిగిన స్థానిక మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి
* వివరాలు వెల్లడించిన ఐసీడీఎస్ అధికారి ఉదయ



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : రంగారెడ్డి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అర్హత కలిగిన స్థానిక మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. ఈ మేరకు సోమవారం షాద్‌నగర్ ఐసీడీఎస్ అధికారి ఉదయ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 26 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఖాళీలను గ్రామాలు, వార్డుల వారీగా నోటిఫికేషన్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న విద్యార్హతలు, వయోపరిమితి, స్థానికత తదితర నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని అధికారి తెలిపారు. ముఖ్యంగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం పరిధికి చెందిన స్థానిక మహిళా అభ్యర్థులకు నిబంధనల ప్రకారం అర్హత ఉంటుందని వివరించారు. దరఖాస్తుల స్వీకరణ సోమవారం నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 10వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. దరఖాస్తు విధానం, అవసరమైన ధ్రువపత్రాలు, విద్యార్హతలు, ఎంపిక ప్రక్రియ తదితర పూర్తి వివరాలను అధికారిక నోటిఫికేషన్‌లో పరిశీలించాలని సూచించారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ అధికారి ఉదయ కోరారు.

* **షాద్‌నగర్ పరిధిలో పోస్టుల వివరాలు**

కొందుర్గు - 6, కేశంపేట - 6, కొత్తూరు - 1, చౌదర్‌గూడ - 1, నందిగామ - 3, ఫరూఖ్‌నగర్ - 8, షాద్‌నగర్ మున్సిపల్ పరిధి - 1 చొప్పున మొత్తం 26 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఐసీడీఎస్ అధికారి ఉదయ తెలిపారు.

* **గ్రామాల వారీగా ఖాళీలు**

కొందుర్గు మండలం: రేగడి చిలకమర్రి, కొత్త ఆగిరాల-1, వెంకిర్యాల-1, తంగేళ్లపల్లి-2, ముట్పూర్-1, కొత్త ఆగిరాల-2.చౌదర్‌గూడ మండలం: కాసులాబాద్.కేశంపేట మండలం: చింతకుంటపల్లి, తొమ్మిది రేకుల, కొత్తపేట-1, పాటిగడ్డ, బైర్ఖాన్‌పల్లి-2, మంగలిగూడ. నందిగామ మండలం: మొదళ్లగూడ, వీర్లపల్లి పరిధిలోని చెర్ల అంతిరెడ్డిగూడ, మామిడిపల్లి పరిధిలోని నసుర్లాబాద్, ఫరూఖ్‌నగర్ మండలం: మేలగూడ తండా, చించోడ్ పరిధిలోని పటేల్‌కుంట తండా, పులిచెర్లకుంట తండా పరిధిలోని కర్ణకుంట తండా, గంట్లవెల్లి తండా, దొంతికుంట తండా, బుచ్చిగూడ, రంగంపల్లి, దేవునిపల్లి పరిధిలోని ఆర్ఆర్ గూడ.షాద్‌నగర్ మున్సిపల్ పరిధి: చటాన్‌పల్లి-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఐసీడీఎస్ అధికారి ఉదయ వెల్లడించారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

* 62 దరఖాస్తులు స్వీకరణ.. డీఆర్వో వసంతకుమారి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజా స్ఫూర్తి : ప్రజావాణిలో అందిన దరఖాస్తులను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని డీఆర్వో వసంతకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 62 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను తప్పనిసరిగా పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజల వినతులపై అధికారులు సత్వరమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

* **మంగీలాల్ మృతికి సంతాపం**

భూపాలపల్లి ఆర్డీవోగా గతంలో విధులు నిర్వర్తించి ప్రస్తుతం వికారాబాద్ డీఆర్వోగా పనిచేస్తూ అకాల మరణం చెందిన మంగీలాల్ మృతికి అధికారులు సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్ల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

* నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు.సోమవారం జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో పాల్గొన్న మేయర్ మాట్లాడుతూఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికల అనంతరం పార్టీలకు అతీతంగా ప్రజల సంక్షేమం, నగర అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తనకు ఏ డివిజన్‌పై వివక్ష లేదని, కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్‌కు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఒక డివిజన్‌ను సందర్శించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మేయర్ తెలిపారు.కార్పొరేషన్ పరిధిలో మిగిలిన సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర మౌలిక వసతుల పనులను పెద్ద ఎత్తున చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.ఏ డివిజన్‌లోనైనా సమస్యలు ఉంటే వాటిని కార్పొరేషన్ సమావేశం దృష్టికి లేదా తన దృష్టికి తీసుకువస్తే, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా, అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేస్తూ నల్లగొండను మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి

* జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో అంకితభావంతో పని చేయాలని జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సోమవారం ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన బాల్య వివాహాల నిర్మూలన అవగాహన పోస్టర్‌ను ఆమె జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. వీటి నివారణ ఒక్క శాఖ బాధ్యత కాదని, మహిళా, శిశు సంక్షేమం, బాలల సంరక్షణ, పోలీసు, విద్య, ఐసీడీఎస్ శాఖలతో పాటు స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామసభలు, మహిళా, యువజన సంఘాల ద్వారా బాల్య వివాహాల దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. 18 ఏళ్లు నిండని బాలికలకు వివాహం చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని కోరారు.

**ముందస్తు గుర్తింపు కీలకం**

డీసీపీఓ మహేష్ మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణలో ముందస్తుగా గుర్తించడం, సమాజ భాగస్వామ్యం, నిరంతర అవగాహన కార్యక్రమాలు కీలకమన్నారు. ప్రమాదంలో ఉన్న బాలికలకు రక్షణ, కౌన్సెలింగ్, విద్య, పునరావాస సహాయాన్ని సంబంధిత శాఖల సమన్వయంతో అందిస్తామని తెలిపారు. బాలికల విద్య, సాధికారతకు కుటుంబాలు, సమాజం ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో డీసీపీయూ కౌన్సిలర్ చంద్రశేఖర్, ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ బండి సంతోష్‌కుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మానుకోట జిల్లాలో బిజెపి పార్టీ బలోపేతంపై చర్చ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావుని మానుకోట జిల్లా బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో పార్టీ సంస్థాగత విషయాలపై పూర్తిస్థాయిలో చర్చించారు.ఈ సందర్భంగా మానుకోట జిల్లాలో పార్టీ సంస్థాగత నిర్మాణం,బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం తదితర అంశాలపై రాష్ట్ర అధ్యక్షులతో చర్చించారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు,పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రతి గ్రామం,ప్రతి బూత్ స్థాయికి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై కూడా చర్చ జరిగినట్లు నాయకులు తెలిపారు.జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని,ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఈ సమావేశంలో బీజేపీ మానుకోట జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు,బీజేపీ మానుకోట జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దిడ్డి మహేష్,బీజేపీ జిల్లా నాయకులు గాడిపెల్లి శ్యామ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 1000 రోజుల కాంగ్రెస్ పాలన.. దగా పాలన: గండ్ర




జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజా స్ఫూర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల్లో అనేకం అమలు చేయలేదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి విమర్శించారు. సెప్టెంబరు 2 నుంచి నిర్వహించనున్న '1000 రోజుల దగా పాలనపై సమరభేరి' కార్యక్రమంపై సోమవారం భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.మహిళలకు నెలకు రూ.2,500 సాయం, కళ్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.4 వేల పెన్షన్ వంటి హామీలు అమలు కాలేదన్నారు. రైతు బంధు సాయాన్ని రూ.15 వేలకు పెంచుతామని చెప్పి మాట తప్పారని, యూరియా కొరత, సాగునీరు, విద్యుత్ తదితర సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలను పునరుద్ధరించి మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబరు 2 నుంచి చేపట్టే సమరభేరి కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ప్రజలకు జరిగిన నష్టాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

# భారత్ కో జానో – 2026 పరీక్షకు విశేష స్పందన

* 26 పాఠశాలలు, సుమారు 5,400 మంది విద్యార్థుల భాగస్వామ్యం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : భారత్ వికాస్ పరిషత్ మానుకోట శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక "భారత్ కో జానో - 2026" పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది.26 పాఠశాలలకు చెందిన సుమారు 5,400 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ పరీక్షలో పాల్గొన్నారు.విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావన, భారతదేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, భౌగోళిక విశిష్టతలు, రాజ్యాంగం, విజ్ఞాన-సాంకేతిక రంగం, క్రీడలు, ప్రముఖ వ్యక్తులు,దేశ విజయాలపై అవగాహన పెంపొందించడం "భారత్ కో జానో" కార్యక్రమ ప్రధాన లక్ష్యమని భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు తెలిపారు.భారతదేశ గొప్పతనాన్ని, మన సంస్కృతి-సంప్రదాయాల విశిష్టతను విద్యార్థి దశ నుంచే తెలుసుకోవడం ద్వారా వారిలో దేశం పట్ల గౌరవం,బాధ్యత, సేవాభావం మరియు జాతీయ చైతన్యం పెంపొందుతాయని పేర్కొన్నారు. కేవలం పరీక్షలో మార్కులు సాధించడమే కాకుండా, "మన భారతదేశాన్ని తెలుసుకుందాం భారతీయులమని గర్విద్దాం" అనే స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పరీక్ష నిర్వహణకు సహకరించిన పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పరీక్ష నిర్వాహకులు,భారత్ వికాస్ పరిషత్ సభ్యులు, ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ మానుకోట శాఖ అధ్యక్షులు వొబిలిశెట్టి రామకృష్ణ,కార్యదర్శి జయప్రకాశ్ లోయ, కోశాధికారి గణేష్‌కృష్ణ, సీనియర్ సభ్యులు వి.వి. నాగేందర్,విశ్వనాథం, ఆవుల శ్రీనివాస్,భూపాల్ రెడ్డి,సంయుక్త కార్యదర్శి లెనిన్ బాబు,విజయ్ తదితరులు పాల్గొని పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.

# ఫీజు బకాయిలు, స్కాలర్షిప్లు వెంటనే విడుదల చేయాలి

* మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : విద్యార్థులకు వెంటనే ఫీజు బకాయిలు , స్కాలర్షిప్లు వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఐడిపిఎల్ చౌరస్తాలో రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర సూచన మేరకు మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక రోజు నిరాహార దీక్ష చేశారు. ఈ దీక్షలో జిల్లా అధ్యక్షులు గిరవర్ధన్ రెడ్డి , ఓ బి సి మోర్చా జిల్లా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి ,మాధురి ఉదయం నుండి సాయంత్రం వరకు దీక్షలో పాల్గొన్నారు వారు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం రెండు కలిసి 15000 కోట్ల ఫీజులు బకాయి చెల్లించకుండా 40 లక్షల విద్యార్థుల భవిష్యత్తు తోటి ఆడుకుంటున్నారన్నారు.

# అన్నా భౌ సాఠే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: కెరమెరి మండల కేంద్రంలో అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు అన్నా భౌ సాఠే ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అన్నా భౌ సాఠే 106వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అన్నాభౌ సాఠే కేవలం రచయిత, కవి మాత్రమే కాకుండా సామాజిక చైతన్యవేత్త, ప్రజా కళాకారుడు, ఉద్యమకారుడుగా ప్రజల జీవితాలను తన రచనల్లో ప్రతిబింబించారని అన్నారు. పేదరికం, సామాజిక అసమానతలు,



వివక్ష, కష్టజీవుల సమస్యలను తన సాహిత్యం ద్వారా ప్రజల ముందుకు తీసుకువచ్చారని తెలిపారు.ఆయన పాటలు, కథలు, నవలలు, జానపద కళారూపాల ద్వారా సామాన్య ప్రజల్లో చైతన్యం నింపారని పేర్కొన్నారు. ముఖ్యంగా కార్మికులు, దళితులు, అణగారిన వర్గాల సమస్యలను తన రచనల్లో బలంగా వినిపించారని గుర్తు చేశారు.అన్నా భౌ సాఠే జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, సామాజిక సమానత్వం, విద్య, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సమాజంలో కొనసాగుతున్న వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. అన్నా భౌ సాఠే ఆశయాలను ఆచరణలోకి తీసుకురావడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనంద్ రావ్, ఉప సర్పంచ్ వాగ్మారె శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహమ్మద్ సుజాహిత్ ఖాన్,మాజీ ఎంపిటిసి గోగర్ల రాజయ్య, సకల్ మతాంగ్ సమన్వయ్ జిల్లా చంద్రాపూర్ జిల్లా అధ్యక్షులు అంకూస్ గోతాలే, దళిత రత్న గ్రహీత నర్సింగ్ మోరే,బాలాజీ కాంబ్లె, సంభాజీ డగే, భీం షాహిర్,గైక్వాడ్ దేవిదాస్, గైక్వాడ్ రాంచందర్, అడ్డే సర ఉప సర్పంచ్ దాసరే అకాష్,పోర్ల వెంకటేష్, సాగర్,గైక్వాడ్ నిఖిల్,రాజేందర్, అంకుస్ కాలనీ ప్రజలు, అన్నా భౌ సాఠే అభిమానులు, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సొంతింటి కల సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

*** ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: సోమవారం భువనగిరి పట్టణంలోని సింగన్నగూడెం వద్ద నిర్మించిన 444 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో సిద్ధం చేసిన 120 ఇళ్లను భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించి, లబ్ధిదారులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొని నూతన గృహాల్లోకి ఎమ్మెల్యే గృహప్రవేశం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

## పీవీఎంఎస్ రాష్ట్ర మహాసభల కరపత్రాలు ఆవిష్కరించిన ఎంపీ వద్దిరాజు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: పారంపర్య వైద్య మహా సంఘం (పివిఎంఎస్) తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభల కరపత్రాలను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆవిష్కరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పారంపర్య వైద్యులందరూ ఒక తాటి మీదికి రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామంచి శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ జి. సుగుణారావు, ప్రకృతి ప్రేమికులు మహమ్మద్ ముస్తఫా, దశరథ్ రజువాలు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి

*** స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 74 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 47, సర్వే ల్యాండ్స్ 5, ఉపాధి కల్పన 3, గ్రామీణ అభివృద్ధి 2, పంచాయతీ 2, మున్సిపాలిటీ 2, ఎంపీడీవోలు 2, బీసీ వెల్ఫేర్ 2, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, సంక్షేమ, ఉద్యానవన, ఎల్.డి.యం , చేనేత మరియు జౌళి, మార్కెటింగ్, కోపరేటివ్, ఇరిగేషన్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కృతిక, సాత్విక్, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బిజెపి కాంగ్రెస్ హోరాహోరీ

*** మంత్రి క్యాంప్ కార్యాలయం ముందు ఫ్లెక్సీని దగ్ధం చేసిన బిజెపి**

*** పట్టణంలో ఉద్రిక్తత భారీగా మోహరించిన పోలీసులు**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ: నల్లగొండ కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ ఆఫీస్ శ్రీ నగర్ కాలనీ వద్ద మంత్రి కోమటి రెడ్డి భారీ కటౌట్ ను బిజెపి నాయకులు దగ్ధం చేయడంతో పట్టణంలో ఉద్రిక్తత నెలకొంది.ఒక మహిళతోపాటు బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, కార్పొరేటర్, అనుచరులు ఉన్నట్టు ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు మంత్రి ఇంటి పై కోడిగుడ్లు, టమాటాల దాడి చేయడంతో సమాచారం అందుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తన అనుచరులతో బయలుదేరి బిజెపి కార్యాలయం పై దాడికి విశ్వప్రయత్నం చేసినారు సమాచారం అందుకున్న పోలీసులు గురు శ్రీనివాసరెడ్డిని అంచర్లను అడ్డుకోవడంతో తీవ్ర ఉధృత పరిస్థితులు నెల న్నాయి కాంగ్రెస్ నాయకుల నినాదాలతో ప్రాంతమంతా మార్మోగిపోయింది బిజెపి ఫ్లెక్సీలను కూడా కాంగ్రెస్ నాయకులు ధ్వంసం చేశారు దీంతో పోలీసులు బిజెపి కార్యాలయం వద్ద డాక్టర్ వద్ద మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద భారీగా మోహరించారు. మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద మంత్రి ఫ్లెక్సీ వ్యర్థం చేసిన సంఘటనను ఎస్పీ సీరియస్ గా తీసుకొని దద్దం చేసిన వారిని గాలిస్తున్నారు.



## జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం: కలెక్టర్ కె.హరిత

*** విముక్త జాతుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు**




కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా, ప్రజా స్ఫూర్తి: జిల్లాలో విముక్త జాతుల ప్రజల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ ప్రగతి, భూముల రీసర్వే, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విముక్త జాతుల దినోత్సవంలో అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, డీఆర్‌ఓ దాసరి వేణులతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విముక్త జాతుల సంక్షేమానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహ వసతి కల్పించడంతో పాటు పిల్లల విద్య, వైద్యం, యువతకు నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాలు అందిస్తుందని తెలిపారు. తెలంగాణ సంస్కృతికి విముక్త జాతుల సాంప్రదాయ కళలు, జానపద రూపాలు విలువైన సంపద అని, వారి హక్కులను కాపాడుతూ సమాజంలో సమానత్వంతో జీవించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.అనంతరం నిర్వహించిన విద్యాశాఖ సమీక్షా సమావేశంలో డీఈఓ సచ్చిదానంద చారితో కలిసి ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, సీఆర్పీలతో జూమ్ ద్వారా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మరియు ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని 100 శాతానికి పెంచాలని ఆదేశించారు. జిల్లాలోని 627 పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, ముఖ్యంగా 2వ తరగతి విద్యార్థులకు ప్రాథమిక దశలోనే తెలుగు, ఇంగ్లిష్, గణితం అంశాలపై పట్టు సాధించేలా నాణ్యమైన బోధన అందించి కంప్యూటర్ విద్యపై అవగాహన పెంచాలన్నారు. భూముల రీసర్వే పురోగతిపై మండల సర్వేయర్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ, భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా డీజీపీఎస్, రోవర్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరికరాలతో సర్వే వేగవంతం చేయాలని, ముందుగానే రైతులకు సమాచారం అందించి వారి సమక్షంలోనే సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఇక ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో ఎంపీడీవో అంజత్ పాషా ఆధ్వర్యంలో అందిన 33 దరఖాస్తులతో సహా అన్ని అర్జీలను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలలో బిసి దేవాధికారి నదీమ్, గిరిజన సంక్షేమాధికారి అంబాజీ, సర్వే ఏడీ వినయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు ఇండ్ల పట్టాలి ఇవ్వాలి

*** సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్**



మహబూబాబాద్ , ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ముందు సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ అధ్యక్షతన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణంలోని 36వార్డుల్లో స్థానిక సమస్యలతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.2014 నుండి ఇప్పటి వరకు పట్టణంలో ఇండ్లు కట్టుకున్న ఇండ్లకు మున్సిపాలిటీ అధికారులు ఇంటి నెంబర్ ఇవ్వడం లేదని దంతో కరెంట్ మీటర్స్ కూడా రావడం లేదని ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ భూమిలో గత 5 సం రాలనుండి ఇండ్లు లేని నీరు పేదలు ఇండ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారని ప్రభుత్వ అధికారులు పరిసలించి వెంటన్నే ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.పట్టణం లోని ఇండ్లులేని నీరు పేదలకు ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్లు నిజమైన అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని అన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని శివారు కాలనీలలో పైప్ లైన్ లేఖ నీళ్ల ఇబ్బందితో ప్రజలు చాలా బాధపడుతున్నారని మున్సిపాలిటీ అధికారులు వెంటనే మిషన్ భగీరథ పైప్ లైన్ వేసి ప్రజలకు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రన్ని మున్సిపాలిటీ కమిషనర్ మాలోత్ వినోద్ కుమార్ కు ఇవ్వడం జరిగింది. స్మందించిన మున్సిపాలిటీ కమిషనర్ తమ పరిధిలోని సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని మిగితావి పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ సూర్నపు సోమయ్య సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి,వన్ టౌన్ కార్యదర్శి రావుల రాజు,పట్టణ కమిటీ సభ్యులు కుమ్మరి కుంట్ల నాగన్న,చాగంటి భాగ్యమ్మ,ఎండి రజాక్,ఎర్ర శ్రీను,మందుల మహేందర్, ఇల్లుటూరి లాలయ్య, శాఖ కార్యదర్శి లు పార్టీ సభ్యులు సానుభూతి పరులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలి

*** రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ,హౌసింగ్ అంశాలపై ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎంపి లు కడియం కావ్య,పోరిక బలరాం నాయక్,ఉమ్మడి జిల్లాలకు సంబందించిన శాసనసభ్యులతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. మంచి పనితీరు కనబరిచే అధికారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, అక్రమాలకు పాల్పడే లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం వెనుకాడదని హెచ్చరించారు.22ఏ నిషేధిత జాబితా,భూ సమస్యలు తదితర అంశాలపై అధికారులు నిబంధనలకు విరుద్ధంగా సొంత నిర్ణయాలు తీసుకోవద్దని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని,వాటికి తక్షణ పరిష్కారం చూపాలని సూచించారు. తెలంగాణలోని ప్రతి మారుమూల ప్రాంతానికి సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నాం.ఇందిరమ్మ ఇండ్లు ఉన్న గ్రామాలు, వార్డుల్లోనే ఓట్లు అడుగుతాం ఇందిరమ్మ పరిపాలన కాలంలో రాష్ట్రం లో 25 లక్షల ఎకరాల భూములను పేదవారికి పంపిణీ చేసామన్నారు.కేసముద్రం మండలంలోని నారాయణపురం గ్రామంలో రైతులకు పట్టాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలోని ప్రతి మారుమూల ప్రాంతానికి సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఇందిరమ్మ ఇండ్లు ఉన్న గ్రామాలు , వార్డుల్లోనే ఓట్లు అడుగుతామన్నారు. సోమవారం 780 మంది రైతులకు భూ ఆధార్ పట్టా పాస్ పుస్తకాలను పంపిణీ చేశామని నాలుగు రోజుల క్రితం తుంగతుర్తి లో 13 గ్రామాలకు చెందిన రైతులకు 3400 ఎకరాలకు పట్టాలను అందించాం భూభారతి తోనే ఇది సాధ్యమైందని రాష్ట్రంలో 125 సంవత్సరాల క్రితం చేసిన సర్వే మళ్లీ ఇప్పుడు చేస్తున్నామని ఈ సర్వే తో శాశ్వతంగా భూ సమస్యలు పరిష్కారం చేసి రాష్ట్రంలో కోటి మందిని కోటీశ్వరులు చేస్తామని అన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉంటుందని అన్నారు.

## పశుసంవర్ధక శాఖ జేడీ సిరికొండ వెంకటయ్య పదవీ విరమణ




ప్రజాస్ఫూర్తి ,మెదక్ జిల్లా: మెదక్ జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ సిరికొండ వెంకటయ్య పదవీ విరమణ సందర్భంగా మెదక్ జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గండి మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ సేవల్లో వెంకటయ్య అందించిన సేవలను కొనియాడుతూ, పదవీ విరమణ అనంతరం ఆయన ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండల అధ్యక్షులు కిష్టయ్య యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చల్ల సత్యం యాదవ్, లక్ష్మణ్ యాదవ్, మెదక్ పట్టణ అధ్యక్షులు జంగిటి బాల్ రాజ్ యాదవ్, నగేష్ తదితరులు పాల్గొని వెంకటయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

## సర్వేయర్ పై చర్యలు తీసుకొని న్యాయం చేయండి

*** ప్రజావాణిలో పిర్యాదు చేసిన దళిత బాధితుడు కత్తుల ఎల్లయ్య**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : నా భూమి కి హద్దులు చూపించి న్యాయం చేయాలని కోరుతూ దళిత బాధితుడు కత్తుల ఎల్లయ్య సోమవారం హుస్నాబాద్ ఆర్డిఓ కార్యాలయం ప్రజావాణిలో హుస్నాబాద్ తహసిల్దార్ లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేశాడు.అనంతరం భాదితుడు విలేకరులతో మాట్లాడుతూ అక్కన్న పేట మండలం గండిపల్లి రెవిన్యూ శివారులో చౌటకుంట తండా పరిధిలో 5 ఎకరాల ఒక గుంట భూమిని నాకు ప్రభుత్వం ఇచ్చిందని, ఇట్టి భూమికి సర్వేయర్ పెట్టి హద్దులు చూపించాలని ఇప్పటికీ పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నానని, అయితే అక్కడ కొంతమంది గిరిజనులు దేవతల పేర్లతో నా భూమిని అక్రమంగా ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని రెవిన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన వాళ్లు పెడచెవిన పెట్టినట్లు అవుతుందని, ఆ తర్వాత సర్వేయర్ లక్ష్మీనారాయణను హద్దులు చూపించమని రెవిన్యూ అధికారులు ఆదేశిస్తే అతను నా దగ్గర నీ హద్దులు పెట్టాలంటే నాకు 20 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడని, బాధితుడు కత్తుల ఎల్లయ్య ఆరోపించారు.?అట్టి డబ్బులను కూడా ఇచ్చానని అయిన నాకు న్యాయం జరగలేదని,హద్దులు చూపించలేదని కనీలనుపాత లేదని,ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు నాకు న్యాయం చేయాలని,కోరుతూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాను సదరు సర్వేర్ పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, నా డబ్బులు నాకు ఇప్పించి న్యాయం చేయాలని. రెవెన్యూ అధికారులు నా భూమికి సంబంధించిన హద్దులు చూపించాలని బాధితుడు న్యాయం చేయాలని కోరాడు.

## మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినయోగంపై గట్టి నిఘా పెట్టాలి

*** జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : సోమవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో భాస్కరరావు అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశంలోసంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లడుతూ మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, వాటి నిరోధానికి అవలంభించాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. కాలేజీలలో చదివే విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.ఫ్యాక్టరీ లలో పని చేస్తున్న వారి పై కూడా దృష్టి సారించాలన్నారు. ఫ్యాక్టరీ లలో ఎంత మంది పనిచేస్తున్నారని, అందులో మన రాష్టం, ఇతర రాష్టం నుండి వచ్చి పని చేసే వాళ్ళు ఎంత మంది పని చేస్తున్నారని తెలుసుకోవాలని, ఫ్యాక్టరీ ల లో పని చేసే వారి పై నిఘా పెట్టాలన్నారు.యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తున్న మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కమిటీగా ఏర్పడి పక్కాగా కృషి చేయాలన్నారు.డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలనుచైతన్యపరచేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలలో డ్రగ్స్ పై కళాశాలలో అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎక్సైజ్ సూపడెంట్ తుక్యానాయక్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# రష్యన్ భామల బ్యూటీ సీక్రెట్స్!

**రష్యా పడతులు.. అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తారు. లేత గులాబీ వర్ణంలో.. అందానికి సరికొత్త నిర్వచనంగా మెరిసిపోతుంటారు. తాజాగా, వీరి బ్యూటీ సీక్రెట్స్‌ను వెల్లడించారు బ్యుటీషియన్లు. రష్యా మహిళల మేనిఛాయ రహస్యాన్ని బయటపెట్టారు.**

చర్మాన్ని శుభ్రపరచడానికి రష్యా మహిళలు 'బన్యా స్టీమ్‌బాత్'ను ఎక్కువగా ఆశ్రయిస్తారు. ఈ స్టీమ్‌బాత్ వల్ల చర్మ రంధ్రాలు లోతుగా శుభ్రమవుతాయి. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఈ పురాతన చర్మ సంరక్షణ పద్ధతితో.. మానసికశారీరక విశ్రాంతితోపాటు చర్మానికి మెరుపు, ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది. ప్లాస్టిక్, రసాయన ఉత్పత్తులకు పూర్తి దూరంగా ఉంటారు.

చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేసేందుకు బిర్చ్/ఓక్ కొమ్మలతో తయారైన స్క్రబ్‌లను ఉపయోగిస్తారు. వీటితో చర్మాన్ని సున్నితంగా మసాజ్ చేయడం వల్ల.. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.

ఎప్పుడూ చల్లగా, పొడిగా ఉండే రష్యాలో.. చర్మం పొడిబారుతూ ఉంటుంది. అందుకే, చర్మాన్ని ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి కొన్ని రకాల సముద్రపు ఉత్పత్తులు, పొద్దు తిరుగుడు, ఆముదం నూనెను వాడుతారు. వీటిలో చర్మ ఆరోగ్యాన్ని రక్షించే పోషకాలు, వృద్ధాప్య నిరోధక లక్షణాలు ఎక్కువ. అవి చర్మం, జుట్టుకు మంచి హైడ్రేషన్ అందిస్తాయి.

కోల్డ్ వాటర్ థెరపీ, ఐస్ ఫేషియల్స్‌తో చర్మాన్ని ఎప్పటికప్పుడు రిఫ్రెష్‌గా ఉంచుకుంటారు. ఈ థెరపీలతో ముఖచర్మం బిగుతుగా మారుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడటంతోపాటు ముడతలూ తగ్గుముఖం పడుతాయి.

ఇక కళ్ల కింద వాపును నివారించడంలో కోల్డ్ వాటర్ థెరపీ అద్భుతంగా పనిచేస్తుంది.

రష్యన్ల సాంప్రదాయ మాస్క్‌లలో ఎక్కువగా ఉపయోగించే పదార్థాలు.. సోర్ క్రీం, తేనె. వంటింట్లో నిత్యం అందుబాటులో ఉండే ఈ పదార్థాలు.. చర్మాన్ని తేమగా, కాంతివంతంగా ఉంచుతాయి.

ఇక క్లెన్సర్లుగా పాల ఉత్పత్తులకు ఓటేస్తారు రష్యన్ అమ్మాయిలు. ఇందులో ఉండే లాక్టిక్ యాసిడ్.. చర్మాన్ని మృదువుగా, హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సాయపడుతుంది. చర్మం పీహెచ్ సమతుల్యతను కాపాడటంతోపాటు చర్మ సహజవర్ణాన్ని మెరుగుపరచడంలోనూ ముందుంటుంది.

..ఇలా రసాయన ఉత్పత్తులపై ఎక్కువగా ఆధారపడకుండానే రష్యన్ అమ్మాయిలు అందాన్ని కాపాడుకుంటున్నారు. సంప్రదాయ పద్ధతులను పాటిస్తూ.. 'బ్యూటీ'కి కేరాఫ్‌గా నిలుస్తున్నారు.



# చిన్న పిల్లలకూ నిద్ర ఉండట్లేదు.. మంచిగా పడుకోవాలంటే...

**ఒత్తిడి.. పెద్దల్నే కాదు, పిల్లల్నీ చిత్తు చేస్తున్నది. విద్యాపరమైన టార్గెట్లలో బాల్యం బందీ అవుతున్నది. ఇక డిజిటల్ గ్యాడ్జెట్ల వాడకం.. పిల్లల నిద్రా నాణ్యతను దెబ్బతీస్తున్నది. వాటిల్లోంచి వచ్చే బ్లూలైట్ వల్ల.. నిద్రను నియంత్రించే మెలటోనిన్ సహజ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతున్నది. మొత్తంగా.. నేటితరం చిన్నారులకు కంటినిండా నిద్ర కరువైపోతున్నది. జీవనశైలిలో మార్పుల వల్ల ఈ సమస్య నుంచి బయట పడే అవకాశం ఉన్నది.**

కొంతమంది పిల్లలు.. ఇలా పడుకోగానే అలా నిద్రలోకి జారుకుంటారు. కొందరికి అస్సలు నిద్రపట్టదు. అలాంటి వారిని నిద్రపుచ్చడానికి తల్లిదండ్రులు నానా తంటాలు పడుతుంటారు. జీవనశైలిలో వచ్చిన మార్పులే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. అయితే, చిన్నారుల ఎదుగుదలలో ఆహారం తర్వాత నిద్రే కీలకమైంది. మెదడు వికాసానికీ నిద్ర దోహదం చేస్తుంది. కాబట్టి, పిల్లలకు కంటినిండా నిద్ర ఎంతో అవసరం.

ఇందుకోసం పిల్లలకు ప్రత్యేక దినచర్యను అలవాటు చేయాలని చెబుతున్నారు నిపుణులు. కథల పుస్తకాలు చదవడం, చిన్నచిన్న వ్యాయామాలు, మృదువైన సంగీతం వినడం వంటివి పిల్లల మనసును ప్రశాంతపరుస్తాయి. ఇక స్క్రీన్ టైమ్‌ను తగ్గించడం, పడుకునే ముందు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను పక్కన పెట్టేయడం.. నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తాయి. వారాంతాల్లోనూ ఒకే సమయానికి నిద్ర లేచే అలవాటు.. నిద్ర చక్రాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది.

ఇక పిల్లల్లో నిద్రను ప్రోత్సహించడానికి.. బెడ్‌రూమ్ చీకటిగా, నిశ్శబ్దంగా, చల్లగా ఉండేలా చూసుకోవాలి. మంచం సౌకర్యవంతంగా ఉండాలి. మనసుకు ప్రశాంతత చేకూర్చే పుస్తకాలు కూడా మంచి నిద్రకు ఆహ్వానం పలుకుతాయి. రాత్రి పడుకునే ముందు శరీరాన్ని సున్నితంగా స్ట్రెచ్ చేయడం, యోగా లాంటివీ.. నిద్రకు సహకరిస్తాయి. అయితే, ఇలాంటి దినచర్యలను పాటించడం కేవలం స్వల్పకాలిక పరిష్కారం కోసమే కాదు. ఇది పిల్లల్లో భావోద్వేగ పరంగా, మానసికంగా సానుకూల మార్పు తీసుకొస్తుంది. స్థిరమైన, ప్రశాంతమైన దినచర్య.. పిల్లలకు స్వీయ నియంత్రణపై నైపుణ్యాన్ని నేర్పుతుంది.

దీర్ఘకాలంలో పిల్లలు ఒత్తిడిని నిర్వహించడానికి సన్నద్ధమవుతారు. మెరుగైన భావోద్వేగాలను కలిగి ఉంటారు. మంచినిద్ర వేసే ఈ పునాది.. పిల్లల తరువాతి జీవితంలో మానసిక ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని పలు సర్వేలూ చెబుతున్నాయి.

### ఎవరెవరికి ఎంతెంత?

ఏడాదిలోపు పసిపిల్లలకు.. రోజుకు 12 నుంచి 16 గంటల నిద్ర అవసరం ఉంటుంది.

ఏడాది నుంచి రెండేళ్ల చిన్నారులు 11 నుంచి 14 గంటలు నిద్రపోవాలి.

మూడు నుంచి ఐదేళ్లలోపు వారికి .. రోజుకు 10 నుంచి 13 గంటలు నిద్రపోతే ఆరోగ్యం. పాఠశాలకు వెళ్లే ఆరు నుంచి పన్నెండేళ్ల పిల్లలు రోజుకు 9 నుంచి 12 గంటలు నిద్రపోవాలి. యుక్త వయసులోకి వచ్చిన వారు ప్రతిరోజూ 8 నుంచి 10 గంటల వరకు నిద్రించాలి.

### మంచి నిద్ర రావాలంటే..

పిల్లలు మంచి నిద్రపోయేలా వారి వయసుకు తగ్గట్లుగా కొన్ని అలవాట్లు చేయాలి. పడుకునే ముందు పిల్లలు రిలాక్స్ కావాలి. 'బెడ్ రొటీన్స్'ను అలవాటు చేయాలి. చిన్నారుల రాత్రి భోజనాన్ని త్వరగా ముగించాలి.

అలాగే, రాత్రిపూట డిన్నర్ లైట్‌గా ఉండేలా చూసుకోవాలి. రాత్రిపూట నిద్రపోవడానికి మారాం చేసే పిల్లలకు పెరుగన్నం, అరటిపండును తినిపిస్తే.. త్వరగా పడుకునే అవకాశం ఉంటుంది.

పడుకునే ముందు పిల్లలకు గోరువెచ్చని నీటితో స్నానం చేయిస్తే.. త్వరగా నిద్రపోతారు.

ఇంట్లో అందరూ ఒకే సమయానికి నిద్రపోతే.. వారితోపాటు పిల్లలూ నిద్రలోకి జారుకుంటారు.

సాయంత్రంపూట పిల్లలు ఔట్‌డోర్స్ గేమ్స్‌లో పాల్గొనేలా చూడాలి.

దీనివల్ల వారి శరీరం అలిసిపోయి.. త్వరగా నిద్రపోవడానికి ఆస్కారం ఉంటుంది.



# మీ జుట్టు వేగంగా.. బలంగా పెరగాలంటే...

**శరీరానికి పూర్తి ప్రొటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.**

**జుట్టు పెరుగుదలకు సూపర్ ఫుడ్స్:** జుట్టు వేగంగా పెరగడానికి పోషకాహారం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉంది. సరైన ఆహారం లేకపోవడం, ఒత్తిడి, మారుతున్న జీవనశైలి కారణంగా జుట్టు రాలడం సమస్య వేగంగా పెరుగుతోంది. పరిశోధన ప్రకారం, మన జుట్టులో 90శాతం ప్రొటీన్ అంటే కెరాటిన్‌తో తయారవుతుంది. శరీరానికి పూర్తి ప్రొటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.

1. **గుడ్డు** – గుడ్లలో ప్రోటీన్, బయోటిన్, జింక్ పుష్కలంగా ఉంటాయి. జుట్టు నిర్మాణానికి ప్రోటీన్ అవసరం. అంటే కెరాటిన్. బయోటిన్ జుట్టును బలపరుస్తుంది. దాని కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తుంది. జింక్ నెత్తిమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
2. **పాలకూర** – పాలకూరలో ఫోలేట్‌తో పాటు ఇనుము, విటమిన్ ఎ, సి ఉంటాయి. శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా ఇనుము జుట్టు మూలాలను బలపరుస్తుంది. విటమిన్ ఎ, సి తలపై సహజ నూనె అంటే సెబమ్ ఏర్పడటానికి సహాయపడతాయి. ఇది జుట్టు పొడిబారడాన్ని తగ్గిస్తుంది.
3. **బెర్రీలు** – స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీస్ వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కణాలను ఫ్రీరాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి. జుట్టు విచ్ఛిన్నతను నిరోధించే కొల్లాజెన్‌ను నిర్మించడంలో సహాయపడతాయి.
4. **చేపలు** – సాల్మన్, సార్డిన్ వంటి చేపలలో ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ డి, ప్రోటీన్లు లభిస్తాయి.. ఇవి జుట్టు మూలాలను బలోపేతం చేస్తాయి. కొత్త జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తాయి. ఒమేగా3 జుట్టు పొడిగా మారడానికి అనుమతించదు.
5. **వాల్‌నట్స్** – వాల్‌నట్స్ ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ, బయోటిన్‌లకు చాలా మంచి మూలం. అవి జుట్టు కణాలలో వాపును తగ్గిస్తాయి. బలాన్ని పెంచుతాయి. బయోటిన్ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.
6. **క్యారెట్లు** – క్యారెట్లలో బీటాకెరోటిన్, విటమిన్ ఎ ఉంటాయి. ఇవి తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు సహజమైన మెరుపును తెస్తాయి. విటమిన్ ఎ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు విరిగిపోకుండా, రాలకుండా నిరోధిస్తుంది.
7. **విత్తనాలు** – గుమ్మడికాయ, అవిసె, చియా వంటి విత్తనాలలో జింక్, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ బి పుష్కలంగా ఉంటాయి. అవి జుట్టు ఆకృతిని మెరుగుపరుస్తాయి. కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తాయి.
8. **బీన్స్** – బీన్స్ వంటి ఆహారాలు అంటే కిడ్నీ బీన్స్, చిక్‌పీస్, బ్లాక్ ఐడ్ బఠానీలు ప్రోటీన్, ఐరన్, బయోటిన్‌తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శాఖాహారులకు జుట్టుకు ఉత్తమమైన ఆహారాలు.
9. **చిలగడదుంప** – చిలగడదుంపలో బీటాకెరోటిన్ ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారి జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఇది తల చర్మం సహజ తేమను కూడా నిర్వహిస్తుంది.

(NOTE: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)



# MOVIE TIME



## కయదును బ్యాన్ చేయాలి..
# ఫ్యాన్స్ ఫైర్

హీరోయిన్ కయదు లోహర్‌పై తమిళ ఫ్యాన్స్ ఫైర్ అవుతోన్నారు. ఈ డ్రాగన్ బ్యూటీ హీరోయిన్‌గా నటించిన మలయాళ మూవీ ఐ యామ్ గేమ్, తమిళ సినిమా ఇమ్మోర్టల్ సెప్టెంబర్ 3న రిలీజ్ అవుతున్నాయి. ఇమ్మోర్టల్ ప్రమోషన్స్‌కు దూరంగా ఉంటూ ఐ యామ్ గేమ్ ప్రమోషన్స్‌లో యాక్టివ్‌గా పాల్గొంటోంది. కయదుకు క్రేజ్, స్టార్‌డమ్ లేని టైమ్‌లో హీరోయిన్‌గా ఆమెకు ఇమ్మోర్టల్ దర్శక నిర్మాతలు అవకాశమిచ్చారని, అదే సినిమా ప్రమోషన్స్‌కు దూరంగా ఉండటం కరెక్ట్ కాదని ఫ్యాన్స్ అంటున్నారు. తమిళ సినిమాలే ఆమెకు పేరు తెచ్చిపెట్టాయని కామెంట్లు పెడుతున్నారు. ఒకటి, రెండు విజయాలు దక్కగానే గర్వం తలకెక్కిందని, కోలీవుడ్ ఇండస్ట్రీ ఆమెను బ్యాన్ చేయాలని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. కాగా ఈ వివాదంపై జీవీ ప్రకాష్ రియాక్ట్ అవుతూ ఇమ్మోర్టల్ ఈవెంట్‌కు ఎందుకు అటెండ్ కాలేదో ఆమెనే అడిగితే బెటర్ అన్నాడు.



# సెట్స్‌లో కాలు పెట్టిన రశ్మిక

గాయం నుంచి కోలుకున్న రశ్మిక మందన్న దాదాపు నెల రోజుల గ్యాప్ తర్వాత సినిమా సెట్స్‌లో అడుగుపెట్టింది. భర్త విజయ్ దేవరకొండతో కలిసి సోమవారం రణబాలి షూటింగ్‌లో తిరిగి కాలు పెట్టింది. విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తోన్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. గాయం కారణంగా రష్మిక, విజయ్ కాంబినేషన్‌లో చిత్రీకరించాల్సిన కొన్ని కీలక సన్నివేశాలు ఆగిపోయాయి. వాటిని షూట్ చేస్తున్నట్లు సమాచారం. పెళ్లి తర్వాత విజయ్, రశ్మిక జంటగా నటిస్తున్న తొలి సినిమా ఇది. దసరా కానుకగా అక్టోబర్ 16న రణబాలి థియేటర్లలోకి రాబోతుంది. ఈ మూవీకి టాక్సీవాలా ఫేమ్ రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది.



# హత:తో హీరోయిన్‌గా ఎంట్రీ

బిగ్‌బాస్ తెలుగు సీజన్ 9 రన్నరప్ తనూజ హారర్ మూవీతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వబోతుంది. ఈ హారర్ సినిమాకు హత: అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సోమవారం టైటిల్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ఈ వీడియో గ్లింప్స్‌లో హీరోహీరోయిన్లను చూపించలేదు. తనూజ రోల్ ఏమిటన్నది మేకర్స్ రివీల్ చేయలేదు. అయితే పిల్లి బతికి ఉందా? చనిపోయిందా? అంటూ ఈ వీడియోలో కనిపించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. తెలుగులో తెరపై ఇప్పటివరకు వచ్చిన హారర్ సినిమాలకు భిన్నమైన కాన్సెప్ట్‌తో ఈ మూవీ రూపొందుతోన్నట్లు సమాచారం. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే పార్ట్ టైమర్స్ అనే వెబ్‌సిరీస్ చేసింది తనూజ. ఇండిపెండెంట్ బిజినెస్‌ఉమెన్స్‌గా రాణించాలని కలలు కన్న ఇద్దరు యువత జీవన ప్రయాణంతో రూపొందిన ఈ వెబ్‌సిరీస్ జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది.





# మా ప్రేమ నిజమే

బలగం హీరోయిన్ కావ్య కళ్యాణ్ రామ్‌తో కీరవాణి కొడుకు కాళ భైరవ ప్రేమలో ఉన్నట్లుగా చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. ఎట్టకేలకు ఈ జంట తమ లవ్‌స్టోరీని కన్ఫామ్ చేశారు. ఇన్‌స్టా ద్వారా తమ బంధాన్ని అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ మేరకు కావ్య, కాళభైరవ వేర్వేరుగా తమ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. "నీతో సమయాన్ని గడపటం అంటే కొండల మీద కూర్చొని పారుతోన్న సేలయేరును చూస్తున్నట్లుగా అనిపిస్తుందని.. మనమిద్దరం జీవితాంతం కలిసి ఉండబోతున్నామని అందరికి చెప్పడానికి ఉత్సాహంగా ఎదరుచూస్తున్నా అంటూ కాల భైరవ ఓ పోస్ట్ పెట్టాడు. ఇప్పుడు వీరిద్దరి పోస్ట్‌లు వైరల్ అవుతున్నాయి.



# లవ్ రూమర్స్ వేళ కెనీషాకు అవకాశం

కోలీవుడ్ హీరో జయం రవి, సింగర్ కెనీషా డేటింగ్‌లో ఉన్నట్లు కొన్నాళ్లుగా కోలీవుడ్ కోడై కూస్తోంది. కెనీషాతో ప్రేమాయణం కారణంగానే తన భార్య ఆర్తికి విడాకులు ఇవ్వడానికి సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. అయితే జయం రవి తన డెబ్యూ మూవీలో సింగర్ కెనీషాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా అవకాశం ఇవ్వడంతో ఆమె పేరు మళ్లీ తెరపైకి వచ్చింది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి సాంగ్స్ కంపోజింగ్, రీరికార్డింగ్ పనులు పూర్తయ్యాయట. త్వరలోనే కెనీషా పేరును మ్యూజిక్ డైరెక్టర్‌గా జయం రవి అఫీషియల్‌గా అనౌన్స్ చేయబోతున్నారట. ఎన్ ఆర్డినరీ మ్యాన్ సినిమాను స్వయంగా నిర్మిస్తూ డైరెక్టర్‌గా కూడా ఈ మూవీతోనే అరంగేట్రం చేస్తున్నాడు జయం రవి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.